www.prajajwalanews.com

# ప్రజాజ్వాల

తెలుగు దినపత్రిక

ఆదివారం | 31-8-2025 | సంపుటి: 15 | సంచిక: 79 | పేజీలు : 8 | వెల : 4/- | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

ప్రజాజ్వాల తెలుగు దినపత్రిక

విలేకరులు కావలేను

సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును

చీఫ్ ఎడిటర్ మాదగారి సుగ్రీవుడు, 9441284503

# 50% సీలింగ్ ఎత్తివేత!

## పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాల సవరణ బిల్లులు ఆమోదించిన మంత్రివర్గం



- 2 బిల్లులు శాసనసభలో ఆమోదించి గవర్నర్ ఆమోదానికి పంపాలని నిర్ణయం
- బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పనకు వీలుగా బిల్లులు రూపొందించిన సర్కారు
- బీసీలకు 42% రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థలకు ఎన్నికలు
- గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా కోదండరాం, మహమ్మద్ అజారుద్దీన్
- వరద నష్టంపై నేడు జిల్లా కలెక్టర్లు, మంత్రులతో సీఎం సమీక్ష
- కేబినెట్ భేటీ నిర్ణయాలు వెల్లడించిన మంత్రులు పొన్నం, పొంగులేటి

హైదరాబాద్: రిజర్వేషన్లపై 50% గరిష్ట పరిమితి ఎత్తివేసి పంచాయతీరాజ్, పురపాలక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వే షన్లు కల్పించేందుకు వీలుగా రూపొందించిన పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాల సవరణ బిల్లులను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. రాష్ట్ర శాసనసభలో ఈ రెండు బిల్లులను ఆమోదించి రాష్ట్ర గవర్నర్ ఆమోదం కోసం పంపాలని నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శనివారం శాసనసభ కమిటీ హాల్లో సమావేశమైన కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అనంతరం సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు.

**బీసీ కోటా పెంపునకు అడ్డంకిగా**

నాటి బిల్లులు: బీసీలకు 42% రిజర్వేషన్ల అమలుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. స్థానిక సంస్థలతో పాటు విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు చట్టబద్ధంగా 42% రిజర్వేషన్లు కల్పించేందుకు గత మార్చిలో శాసనసభలో రెండు బిల్లులను ఆమోదించి గవర్నర్‌కు పంపించగా, ఆయన ఆమోదించకుండా రాష్ట్రపతికి పంపించడంతో ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. రిజర్వేషన్లపై 50% సీలింగ్ విధిస్తూ 2018లో పంచాయతీరాజ్ చట్టానికి, 2019లో మున్సిపల్ చట్టానికి నాటి సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన సవరణ బిల్లులు బీసీ రిజర్వేషన్ల పెంపునకు అడ్డంకిగా మారాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లపై 50% సీలింగ్ ఎత్తివేసేందుకు గత మంత్రివర్గ సమావేశంలో ఆర్డినెన్స్‌లను ఆమోదించి గవర్నర్‌కు పంపించగా, ఆయన వాటిని సైతం ఆమోదించకుండా రాష్ట్రపతికి సిఫారసు చేశారని చెప్పారు. మరోవైపు పంచాయతీరాజ్ ఎన్నికలను సెప్టెంబర్ 30లోగా పూర్తి చేయాలంటూ హైకోర్టు గడువు విధించిందని గుర్తు చేశారు. ఈ పరిస్థితుల్లో బీసీ రిజర్వేషన్లపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం ఇటీవల న్యాయ నిపుణులతో చర్చించిందని తెలిపారు. తాజాగా బీసీలకు 42% రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించిందని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించిందన్నారు. 50% సీలింగ్ ఎత్తివేసేందుకు వీలుగా ఆదివారం శాసనసభలో ప్రవేశపెట్టనున్న రెండు బిల్లుల ఆమోదానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, మాజీ క్రికెటర్ మహమ్మద్ అజారుద్దీన్‌ల పేర్లను ప్రతిపాదించాలని మంత్రివర్గం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో వర్షాలు, వరదలతో సంభవించిన

(మిగతా 2వ పేజీలో)



# ప్రజాస్వామ్య పరిరక్షణకు కలిసి సాగుదాం

- కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారం గుప్పిట పట్టుకోవడానికి కుయుక్తులు
- లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ఏకమై తిప్పికొట్టాలి
- సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: అధికారం కన్నా విపక్షంగా ఉంటూనే ప్రజా సమస్యలపై పోరాటాలకు కమ్యూనిస్టులు ఆసక్తి కనబరుస్తారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో మొన్నటి అధికార బదలాయింపులో కమ్యూనిస్టుల సహకారం ఎంతో ఉందని ఆయనన్నారు. శనివారం రవీంద్రభారతిలో సిపిఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కమ్యూనిస్టు నేత సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ జరిగింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీలకతీతంగా వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు పాల్గొని రెండు మౌనం పాటించారు. అనంతరం సురవరం సుధాకర్ రెడ్డికి చిత్రపటానికి

(మిగతా 2వ పేజీలో)



## కేబినెట్ కీలక నిర్ణయం.. కోదండరామ్, అజారుద్దీన్‌లకు గుడ్‌న్యూస్



## బిహార్ సీఎం అభ్యర్థిని నేనే

### రాహుల్ సమక్షంలోనే తేజస్వి వ్యాఖ్యలు

### యూరియా కొరత

# తక్షణమే తీర్చాలి

- సచివాలయం వద్ద బిఆర్ఎస్ మెరుపు ధర్నా
- అసెంబ్లీ సమావేశాల తొలిరోజు బీఆర్ఎస్ నిరసన
- గన్‌పార్కు వద్ద యూరియా సంచులు, ప్లకార్డుల ప్రదర్శన
- వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో ధర్నా
- సచివాలయం ఎదుట బైఠాయింపునకు యత్నం
- అదుపులోకి తీసుకుని తెలంగాణ భవన్‌కు తరలించిన పోలీసులు



హైదరాబాద్ : యూరియా కొరత తక్షణమే తీర్చాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు సచివాలయం ఎదుట మెరుపు ధర్నాకు దిగారు. ప్రధాన గేటు వద్ద బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతులకు సరిపడా యూరియాను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం కెటిఆర్, హరీష్‌రావు నేతృత్వంలోని బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అసెంబ్లీ నుంచి వ్యవసాయ కమిషన్ వద్దకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీగా వెళ్లారు. కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చి కమిషనర్ కార్యాలయం ఎదుట వారు ధర్నాకు దిగారు. అక్కడ

(మిగతా 2వ పేజీలో)




# చైనాకు చేరుకున్న ప్రధాని మోడీ

## నేడు జిన్‌పింగ్‌తో కీలక భేటీ

తియాంజిన్ (చైనా) : జపాన్ పర్యటన ముగించుకున్న ప్రధాని నరేంద్ర మోడీ శనివారం రాత్రి చైనాకు చేరుకున్నారు. ఆదివారం నుంచి రెండురోజుల పాటు ఇక్కడి తియాంజిన్‌లో జరిగే చైనా ప్రతిష్టాత్మక షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) వార్షిక సదస్సులో పాల్గొనడమే ప్రధాని మోడీ పర్యటన ప్రధాన ఉద్దేశం. అయితే ఈ నేపథ్యంలోనే చైనా అధినేత జి జింపింగ్‌తో ప్రత్యేకంగా సమావేశం కావడం, అమెరికా టారీఫ్‌లు, మార్కెట్ల ఒడుదుడుకుల క్రమంపై చర్చలు జరపడం, సమీక్షించుకోవడం భారత్‌కు అత్యంత ప్రధాన విషయం అయింది. ఆదివారం, సోమవారం షాంఘై సదస్సు జరుగుతుంది. ఇక్కడికి రష్యా అధినేత పుతిన్ రావడం కూడా కీలకం అయింది. ప్రత్యేకించి ఆదివారం చైనా అధ్యక్షులు జిన్‌పింగ్‌తో ప్రధాని భేటీకి రంగం సిద్ధం అయింది. ఈ రోజే షాంఘై సదస్సు విస్తృత స్థాయి సంప్రదింపులు కూడా జరుగుతాయి. 2020లో లద్దాఖ్‌లో భారత్ చైనా సైనికుల ఘర్షణలు, సంబంధాల మధ్య ప్రతిష్టంభన క్రమేపీ సమసిపోవడం జరిగింది. ఏడేళ్ల తరువాత ప్రధాని మోడీ ఇక్కడికి రావడం ఇదే తొలిసారి. జపాన్‌లోనే అక్కడి ప్రధాన పత్రికకు ప్రధాని మోడీ శుక్రవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో భారత్ చైనా పటిష్ట బంధం అత్యవసరం అని, ఈ ప్రాంతం, పరస్పరమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో

(మిగతా 2వ పేజీలో)



## ఆర్థిక ఇబ్బందులతో ప్రాణం తీసుకోవాలనుకున్న దంపతులు

::: భర్త మృతి.. భార్యకు తీవ్ర గాయాలు

# అసెంబ్లీ నేడు ఒక్కరోజే

- వర్షాకాల సమావేశాలు నేటితో ముగించాలని నిర్ణయం
- బీఏసీ సమావేశంలో ప్రతిపాదించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆదివారం సభ ముందుకు 'కాళేశ్వరం'పై పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టు.. చర్చ
- ఆ తర్వాత స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేతకు సంబంధించిన బిల్లులు
- 15 రోజుల పాటు చర్చించాలని బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం ప్రతిపాదన
- ప్రభుత్వం అంగీకరించకపోవడంతో బీఆర్ఎస్ వాకౌట్



హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలు రెండోరోజు ఆదివారంతోనే ముగించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. పలు జిల్లాల్లో వర్ష బీభత్సం, గణేశ్ నిమజ్జనం తదితరాల నేపథ్యంలో ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. అవసరమైతే కొద్ది విరామం తర్వాత మళ్లీ సమావేశాలు నిర్వహించే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు శనివారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) భేటీలో ప్రభుత్వం ప్రతిపాదించినట్లు

(మిగతా 2వ పేజీలో)

# ప్రజాస్వామ్య పరిరక్షణకు కలిసి సాగుదాం

నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశనుండి జాతీయ స్థాయికి ఎదిగిన పాలమూరు ముద్దుబిడ్డ సుధాకర్ రెడ్డి అని కొనియాడారు. తాను నమ్మిన సిద్దాంతాలను తుదిశ్వాస వరకు ఆచరిస్తూ ఆదర్శంగా నిలిచారన్నారు. పేద ల జీవితాల్లో మార్పు రావాలని వారి కోసం నిరంతరం శ్రమించిన నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని స మాజంలో అసమానతలు, అనాగరిక చర్యలకు వ్యతిరేకంగా పోరాడుతూ ఎన్నో చైతన్యవంత కార్యక్రమాలు చేపట్టారన్నారు. మొదటి తరంలో సురవరం ప్రతాప్ రెడ్డి, బూర్గుల రామకృష్ణారావు వంటి వారు పాలమూరు జిల్లాకు వన్నె తెచ్చారని, రెండోతరంలో జైపాల్ రెడ్డి, సురవరం సుధాకర్‌రెడ్డి రాజకీయాల్లో రాణించి విలువలను పెంపొందించారని కొనియాడరు. సుధాకర్‌రెడ్డి శాశ్వతం గా గుర్తుండి పోయేలా మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పునరుద్ఘాటించారు. కేంద్రంలోని ప్రభు త్వం వన్ నేషన్, వన్ ఎ లక్షన్ పేరుతో అధికారాన్ని తన గుప్పిట్లో పెట్టుకోడానికి ప్రయత్నిస్తోందని విమర్శించా రు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఇందుకోసం జస్టిస్ సుదర్శన్ రెడ్డి ని ఉపరాష్ట్రపతి అభ్యర్తిగా నెలిబెట్టినట్లు తెలిపారు. టిపిసిసి అధ్యక్షుడు, ఎంఎల్‌సి మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ పాటు కమ్యూనిస్టులు బలపడాలని అన్నారు. సు రవరం సుధాకర్ రెడ్డి జీవనశైలి ఎల్లప్పుడు మార్గదర్శకంగా ఉంటుందన్నారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యా యమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమాలతో జాతీయ స్థాయికి ఎదిగిన సువరం సుధాకర్‌రెడ్డి కార్మిక సమస్యలపై, ప్రజా సమస్యలపై పోరాడిన గొప్ప కమ్యూనిస్టు అని నివాళులర్పించారు. సిపిఎం పో లిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు మాట్లాడుతూ.. సుధాకర్‌రెడ్డి వ్యక్తిత్వం, పనిపద్ధతి, నడక తీరు తనతో పాటు అనేక మందిపై చెరగని ముద్ర వేసిందన్నారు. ఆయన ఉదార వ్యక్తిత్వం, హుందాతనం క మ్యూనిస్టు ఉద్యమాలకు స్ఫూర్తి అని అన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మా ట్లాడుతూ– మార్క్ సూచించిన నూతన సమాజ నిర్మాణం కోసం సుధాకర్



రెడ్డి కృషి చేశారన్నారు. బిఆర్‌ఎస్ నేత వినోద్ కుమార్ మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి ప్రభావం వ్యక్తిగతంగా తనపై ఎక్కువగా ఉందన్నారు. సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, కార్యదర్శి కె. నారాయణ, సిపిఐ నేత, సురవరం సుధాకర్‌రెడ్డి సతీమణి విజయలక్ష్మి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంఎల్‌ఎ మల్‌రెడ్డి రంగారెడ్డి, సామ్యూల్, ఎంపి ఈటల రా జేందర్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తదితరు లు తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి సురవరం సుధాకర్ రెడ్డిపై రూపొందించిన పాటల సీడీని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

# ఆర్థిక ఇబ్బందులతో ప్రాణం తీసుకోవాలనుకున్న దంపతులు

## భర్త మృతి.. భార్యకు తీవ్ర గాయాలు



హైదరబాద్: ఆ భార్యాభర్తలు ఒకరికొకరు తోడు.. నీడగా జీవనం సాగించాలనుకున్నారు. కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలని భావించారు. అయితే వారిని ఆర్థిక ఇబ్బందులు వెంటాడాయి. అప్పుల బాధలు ఎక్కువయ్యాయి. దీంతో ప్రాణం తీసుకోవాలని భావించారు. ఎలా మృతి చెందాలో అర్థం కాలేదు. ప్రాణం తీసుకునే ధైర్యం లేకో.. ఏమో..ఒకరిని ఒకరు కత్తితో పొడుచుకొని చావాలని నిర్ణయించుకున్నారు. నాలుగు రోజుల పాటు ఒకరిని ఒకరు పొడుచుకున్నారు. ఈ క్రమంలో భర్త మరణించగా భార్య తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. గుంటూరు జిల్లాకు చెందిన ఆళ్ల రామకృష్ణారెడ్డి (45), రమ్యకృష్ణ(38)లు కేపీహెచ్‌బీ కాలనీలో ఉంటున్నారు. రామకృష్ణారెడ్డి ఓ యూట్యూబ్ ఛానల్‌లో పనిచేస్తుండగా భార్య గృహిణి. గతంలో నిర్వహించిన వ్యాపారాల్లో ఆర్థికంగా నష్టపోయారు. దీంతో అప్పులు పెరిగిపోయాయి. ఇద్దరూ కలిసి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఒకరికొకరు గాయపరుచుకోవాలని నిర్ణయించుకున్నారు. గత నాలుగు రోజులుగా ఒకరిని ఒకరు ఉదరభాగం, మణికట్టు, గొంతుపై గాయపరుచుకున్నారు. ఉదర భాగంలో తీవ్ర రక్తస్రావమై రామకృష్ణ శుక్రవారం మృతి చెందగా, రమ్యకృష్ణ తీవ్రంగా గాయపడింది. శనివారం ఉదయం రమ్యకృష్ణ 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించింది. కేపీహెచ్‌బీ పోలీసులు వెళ్లి చూడగా రామకృష్ణ మృతి చెందినట్లు గమనించారు. రమ్యకృష్ణ సోఫాలో కూర్చుని ఉంది. వెంటనే ఆమెను పోలీసులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కూకట్‌పల్లి ఏసీపీ రవికిరణ్ రెడ్డి, కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, సెక్టార్ ఎస్ఐ శ్రీలతా రెడ్డిలు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రామకృష్ణారెడ్డి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

**మూడు నెలల క్రితమే...**

వీరు మూడు నెలల క్రితమే నిర్ణయించుకున్నట్లు రమ్యకృష్ణ పోలీసులకు చెప్పినట్లు సమాచారం. శుక్రవారం రామకృష్ణ బలమైన గాయం చేయాలని రమ్యకృష్ణపై ఒత్తిడి చేయడంతోపాటు తనను తాను గాయపరుచుకునేందుకు యత్నించాడు. తీవ్ర రక్తస్రావంతో రామకృష్ణ మృతి చెందాడు. బెడ్ మొత్తం రక్తపు మరకలతో నిండిపోయింది. ఇదిలా ఉండగా పోలీసులు వచ్చే వరకు అపార్టుమెంట్‌లో ఏ ఒక్కరికి కూడా విషయం తెలియకపోవడం, కత్తితో తీవ్రంగా గాయాలు చేసుకున్నప్పటికి ఎవరూ అరవకపోవడం గమనార్హం.

**సూసైడ్ నోట్ రాసి...**

అవమానాలు భరించలేకపోతున్నాం... ఈ లోకంలో ఉండలేకపోతున్నాం. అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నాం అని రాసి ఉన్న సూసైడ్ నోట్‌ను పోలీసులు రామకృష్ణ గదిలో స్వాధీనం చేసుకున్నారు. పదిహేను రోజుల క్రితం రాసిన ఈ లేఖలో ఆర్థికం ఇబ్బందులుతో పాటు చేతి బదులుగా డబ్బులు ఇచ్చిన వారు తీర్చేందుకు సమయం ఇవ్వకపోవడం అవమానించడం వంటి వివరాలను రాసినట్లుగా ఉంది.

# ఎజెండాను రాత్రికి రాత్రే డిసైడ్ చేస్తామంటే ఎలా?: హరీష్‌రావు



హైదరాబాద్ : ప్రజా సమస్యలపై మాట్లాడకుండా.. రెండు రోజులే అసెంబ్లీ నిర్వహించి చేతులు దులుపుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు ఆరోపించారు. శనివారం బీఏసీ సమావేశం నుంచి అర్ధాంతరంగా బయటకు వచ్చిన ఆయన.. మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. శాసన సభలో వరదల పై చర్చించాలని కోరాం. ఫీజ్ రీయింబర్స్మెంటుపై మాట్లాడాలని కోరాం. యూరియా కొరత పై మాట్లాడాలి కోరాం. ప్రభుత్వ ఉద్యోగుల టీఏ, డీఏపై మాట్లాడాలనీ కోరాం. ప్రజా సమస్యలు మాట్లాడకుండా రెండు రోజులే సభ నిర్వహిస్తామని చెబుతున్నారు. మేం 15 రోజులు అసెంబ్లీని నిర్వహించాలని కోరాం. వరదపై మాట్లాడకుండా బురద రాజకీయం చేయాలని చూస్తున్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ఎరువులపై చర్చించాలని ఇవాళ సభ నుంచి వాకౌట్ చేశాం. ప్రజా పాలన అంటే ప్రతిపక్షాల గొంతు నొక్కడమా..?. బీఏసీ సమావేశం అర్థం పర్థం లేకుండా పోయింది. రేపటి ఎజెండా ఏందో ఇప్పటి వరకు చెప్పలేదు. రాత్రికి చెబితే ప్రతిపక్ష ఎమ్మెల్యే లు ఎప్పుడూ ప్రిపేర్ అవ్వాలి. అందుకే బీఏసీ నుంచి వాకౌట్ చేశాం అని హరీష్‌రావు అన్నారు. ఇదిలా ఉంటే.. సభ ఎన్నిరోజులపాటు నిర్వహించాలన్నది రేపు(ఆదివారం) నిర్ణయిస్తామని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అంటున్నారు. "కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ పై రేపు సభలో చర్చ ఉంటుంది. బీసీ రిజర్వేషన్ల బిల్లు ను రేపు సభలో పెడతాం. బీఆర్ఎస్‌కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు అనుమతి ఇవ్వాలా? లేదా? అనేది స్పీకర్ నిర్ణయం తీసుకుంటారు. అన్ని అంశాలపై చర్చ చేయాలంటే.. నాలుగైదు రోజులు బ్రేక్ ఇచ్చి సభ నడుపుతాం. గణేష్ నిమజ్జనం ,వరదల నేపథ్యంలో.. మధ్య లో బ్రేక్ ఇవ్వాలని డిసైడ్ అయ్యాం అని శ్రీధర్‌బాబు మీడియాకు తెలిపారు.

# అసెంబ్లీ నేడు ఒక్కరోజే



సమాచారం. అయితే ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌తో పాటు బీజేపీ, ఎంఐఎం పార్టీలు కూడా కనీసం 15 రోజుల పాటు సమావేశాలు నిర్వహించాలని కోరినట్లు తెలిసింది. ఆ ప్రతిపాదనకు ప్రభుత్వం అంగీకరించక పోవడంతో భేటీ నుంచి బీఆర్ఎస్ వాకౌట్ చేసింది. ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీసీ ఘోష్ కమిషన్ పూర్తి నివేదికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభకు సమర్పిస్తారు. దీనిపై చర్చ అనంతరం పంచాయతీరాజ్, మున్సిపల్ చట్ట సవరణ బిల్లులపై కూడా సభలో చర్చిస్తారు. స్థానిక సంస్థలతో పాటు మున్సిపాలిటీల్లో రిజర్వేషన్లకు సంబంధించి ఉన్న గరిష్ట పరిమితిని ఎత్తివేస్తూ సవరణలు ప్రతిపాదిస్తారు. పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 285 (ఎ)కు సవరణల ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు మార్గం సుగమం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**పీపీటీకి బీఆర్ఎస్ పట్టు**

పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు తమకు అవకాశం ఇవ్వాలని బీఏసీ భేటీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు కోరారు. ఈ విజ్ఞాపనను పరిశీలిస్తానని స్పీకర్ హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఇక కాళేశ్వరం నివేదికపై అసెంబ్లీలో జరిగే చర్చలో ప్రతిపక్ష నాయకుడు, మాజీ సీఎం కేసీఆర్ పాల్గొనే అవకాశాలు కనిపించడం లేదు. అయితే సభలో అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్ ఇప్పటికే దిశా నిర్దేశం చేసినట్లు తెలిసింది. యూరియా కొరత, వరద బీభత్సం, విష జ్వరాలు, గురుకులాల్లో విద్యార్థుల మరణాలు తదితర ప్రజా సమస్యలపై చర్చించాలని బీఏసీ సమావేశంలో బీఆర్ఎస్ ప్రతిపాదించింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, బీజేపీ శాసనసభా పక్షం నాయకుడు ఏ.మహేశ్వర్‌రెడ్డి ఈ భేటీలో పాల్గొన్నారు. ఇక శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మండలి బీఏసీ సమావేశంలో భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబుతో పాటు డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మహేశ్‌కుమార్ గౌడ్, నెల్లికంటి సత్యం, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు పాల్గొన్నారు.

# 50% సీలింగ్ ఎత్తివేత!

ప్రాణ, ఆస్తి నష్టంపై ఆదివారం సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఇన్‌చార్జి మంత్రులతో సమీక్ష నిర్వహిస్తారని చెప్పారు. వర్షాలతో జాతీయ రహదారులు, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లు, రైల్వే లైన్లు, చెరువులకు జరిగిన నష్టంపై సమగ్ర అంచనాలను సిద్ధం చేసి పూర్తి వివరాలతో ఈ సమావేశానికి రావాల్సిందిగా మంత్రివర్గం వారిని ఆదేశించిందని తెలిపారు. అత్యవసరంగా చేపట్టాల్సిన పునరుద్ధరణ, మరమ్మతు పనులకు ఈ సమీక్షలో సీఎం ఆమోదం తెలుపుతారన్నారు.

**గోవుల సంక్షేమానికి కొత్త విధానం**

గోవుల సంక్షేమానికి విధివిధానాలను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. గోవుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, సీఎస్ఆర్, ఇతర మార్గాల్లో నిధుల సమీకరణ తదితర అంశాలతో ఒక పాలసీని రూపొందించినట్టు పొంగులేటి తెలిపారు. ఇలావుండగా ప్రాజెక్టులకు వచ్చే వరదలను కచ్చితంగా అంచనా వేసేందుకు అవసరమైన సాంకేతిక పరికరాల సమకూర్చుకోవడానికి కావాల్సిన కేంద్ర నిధుల కోసం నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టులో చేరాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది.

**డబ్బులు చెల్లించని మిల్లర్లపై పీడీ యాక్ట్**

గత ప్రభుత్వం 2022–23 రబీ సీజన్‌లో సమీకరించి మిల్లర్లకు కేటాయించిన ధాన్యంలో ఇంకా 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రికవరీ కాలేదని, ఆ ధాన్యానికి సంబంధించిన డబ్బులను రికవరీ చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని పొంగులేటి తెలిపారు. డబ్బులు చెల్లించని మిల్లర్లపై పీడీ యాక్ట్ కింద కేసులు పెట్టాలని తీర్మానించామన్నారు. మత్స్య సహకార సంఘాలకు ఎన్నికల నిర్వహణలో జాప్యం జరుగుతున్న నేపథ్యంలో వాటిలోని సభ్యులనే పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

# చైనాకు చేరుకున్న ప్రధాని మోడీ

ప్రపంచ వ్యాప్తంగా కూడా ఈ పటిష్ట బంధం మైలురాయి అవుతుందని తెలిపారు. చైనా భారత్ నేతల మధ్య సంప్రదింపుల పైనే ప్రపంచం దృష్టి కేంద్రీకృతం అయింది. ఇక్కడి పరిణామాలను అమెరికా నిశితంగా పరిశీలిస్తోంది. జిన్‌పింగ్‌తో చర్చల దశలో ఇరు దేశాల ఆర్థిక సంబంధాలు దిశలో అంగీకారానికి వీలుంది. ఇక అమెరికా మార్కెట్ ప్రతిబంధకాల దశలో భారతీయ సరుకులకు చైనా మార్కెట్ అవకాశాలపై కూడా సమీక్ష జరుగుతుందని భావిస్తున్నారు. తియాంజిన్ సమ్మిట్‌లోనే పలువురు నేతలతో చర్చల సందర్భంగా ట్రంప్ సుంకాల విషయంపై కూడా ప్రధాని సమీక్షించే అవకాశం ఉంది. చాలా వ్యూహాత్మక పరిణామాల తరువాతనే చైనాలో ప్రధాని పర్యటనకు ఏర్పాట్లు జరిగాయి. పదిహేను రోజుల క్రితమే చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ భారత్‌లో పర్యటించి వెళ్లారు. విదేశాంగ మంత్రి జైశఃకర్‌తో, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్‌లో చర్చించారు. ఈ క్రమంలోనే చైనా షాంఘై సదస్సుకు మోడీ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇరుదేశాల మధ్య సరిహద్దు సమస్యల పరిష్కారం దిశలో ఇప్పటికే కుదిరిన సైనికాధికారుల స్థాయి అంగీకారాలను అమలు చేయడం ద్వారా ఇకపై వివాదాలు తలెత్తకుండా చేసేందుకు కూడా చైనా, భారత్ నేతలు కీలక నిర్ణయాలు తీసుకుంటారు. గతంలో ప్రధాని మోడీ 2018లో చైనాలో షాంఘై సదస్సులో పాల్గొనే ందుకు వచ్చారు. మరుసటి సంవత్సరం చైనా అధినేత జిన్‌పింగ్ భారత్‌కు వచ్చి వెళ్లారు. ఈ రెండు సందర్భాలలోనూ ఇరువురు నేతల మధ్య ఇష్టాగోష్టిగా పలు విషయాలు ప్రస్తావనకు వచ్చాయి. తరువాతి దశలో సరిహద్దు ఘర్షణల నివారణకు మార్గం ఏర్ప డింది. భారత్ చురుకైన ప్రాతినిధ్యం క్రమంలో షాంఘై సదస్సు నుంచి అమెరికా టారీ ఫ్‌లపై సమన్వయ రీతిలో వ్యూహాత్మక చర్యలకు అధికారికంగా కానీ లేక అంతర్గత స్థా యిలో కానీ అంగీకారం కుదిరేందుకు వీలుందని విశ్లేషిస్తున్నారు. చైనా ఉత్తం ్ప్రాంతం లో ఉన్న తియాంజిన్ బోహాయి సముద్ర తీరంలోని పెద్ద పట్టణం.రష్యా, టర్కీ , ఇరాన్, పాకిస్థాన్ ఇతక దేశాధినేతల ఆగమనంతో ఇక్కడనే రష్యా ఉక్రెయిన్ యుద్ధ నివారణ విషయాలు కూడా ప్రస్తావనకు వస్తాయని అంతర్గత అజెండాలో స్పష్టం అయింది.

# కేబినెట్ కీలక నిర్ణయం.. కోదండరామ్, అజారుద్దీన్‌లకు గుడ్‌న్యూస్

హైదరాబాద్: తెలంగాణ కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అందులో భాగంగా ప్రొఫెసర్ కోదండరామ్ , మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌లకు కేబినెట్ శుభవార్త అందించింది. గవర్నర్ కోటాలో వీరిద్దరిని ఎమ్మెల్సీలుగా ఎంపిక చేయాలని తీర్మానించింది. కొద్ది రోజుల క్రితం సుప్రీం కోర్టు ఆదేశాలతో కోదండరామ్, అమీర్ అలీ ఖాన్‌ల ఎమ్మెల్సీ నియామకం రద్దైన విషయం తెలిసిందే. ఆ తర్వాత రెండు ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్ జారీ అయింది. తాజాగా మరోసారి కోదండరామ్‌ను, అమీర్ అలీ ఖాన్ స్థానంలో అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ సీటును పక్కా చేసింది. రాష్ట్ర కేబినెట్ ఈ విషయాన్ని తీర్మానించి గవర్నర్‌కు పంపించింది. దీంతో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎదురు చూస్తున్న అజారుద్దీన్‌ను అనూహ్యంగా ప్రభుత్వం ఎమ్మెల్సీగా ఎంపిక చేసింది.

# బిహార్ సీఎం అభ్యర్థిని నేనే

ఆరా(బిహార్): బిహార్‌లో మహాఘట్‌బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి తానేనంటూ ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రకటించుకున్నారు. శనివారం ఆరా జిల్లాలో ఓటర్ అధికార్ యాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ సమక్షంలోనే ఈ పరిణామం చోటుచేసుకుంది. బిహార్ సీఎం అభ్యర్థి ఎవరన్న దానిపై రాహుల్ గాంధీ ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వలేదు. ఆరా ర్యాలీలో తేజస్వీ మాట్లాడుతూ..తాను ప్రకటించిన సంక్షేమ కార్యక్రమాల్నే సీఎం నితీశ్ కుమార్ అమలు చేస్తున్నారని ఆరోపించారు. 'ముందు నేను వెళ్తుంటే ప్రభుత్వం వెనుక వస్తోంది. కాపీ కొట్టే సీఎం కావాలా? ఒరిజినల్ సీఎం కావాలా?'అంటూ ప్రజలను ప్రశ్నించారు. మహాఘట్ బంధన్ తరఫున అసలైన సీఎం అభ్యర్థి తానేనంటూ ప్రకటన చేశారు. రాహుల్ గాంధీ మాత్రం మౌనంగా ఉండిపోయారు. దీంతో తేజస్వి...కాంగ్రెస్ జాతీయ పార్టీయే అయినప్పటికీ బిహార్‌లో ఆర్‌జేడీ పెద్దన్న అని, తమదే పైచేయి అన్న అర్థంలో మాట్లాడారు.

# యూరియా కొరత తక్షణమే తీర్చాలి

పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని తరలించారు. ఈ క్రమంలో బిఆర్ఎస్ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు ఉన్న పోలీసు వ్యాన్ సచివాలయం వద్దకు చేరగానే తమకు వాంతులు వస్తున్నాయని, వ్యాన్ ఆపాలని బిఆర్ఎస్ నాయకులు పోలీసులపై ఒత్తిడి తెచ్చారు. అయినా వాహనం ఆపకుండా వెళుతుండడంతో వారు బలవంతంగా వ్యాన్ నుంచి దిగడానికి ప్రయత్నించడంతోపాటు విధిలేని పరిస్థితిలో పోలీసులు వాహనాన్ని నిలిపివేశారు. దీంతో వ్యాన్ ఆపగానే కెటిఆర్, హరీష్‌రావు సహా బిఆర్ఎస్ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు అందులో నుంచి దిగి పరుగెత్తుకుంటూ వెళుతూ సచివాలయం ఎదుట మెరుపు ధర్నాకు దిగారు. పోలీసులు అక్కడికి కూడా చేరుకుని వారిని అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. కాగా, పోలీసులు అదుపులో ఉన్న బిఆర్ఎస్ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు ఏ విధంగా తప్పించుకుని సచివాలయం వద్ద ధర్నాకు దిగారని సిఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ ఘటనపై నగర పోలీసు కమిషనర్ సి.వి.ఆనంద్‌ను నివేదిక ఇవ్వాలని కోరినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, అంతకుముందు యూరియా కొరత తక్షణమే తీర్చాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు సచివాలయం ప్రధాన గేటు వద్ద బైఠాయించారు. మాజీ మంత్రి హరీష్‌రావు నేతృత్వంలో ఇనుప కంచెలను, పోలీసు ఆంక్షలను లెక్క చేయకుండా సచివాలయం ప్రధాన గేటు వద్దకు చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కెటిఆర్, ఇతర బిఆర్ఎస్ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు ర్యాలీగా అక్కడికి చేరుకుని యూరియా కొరత తీర్చాలని డిమాండ్ చేస్తూ నిరసనకు దిగారు.

## 130 రాజ్యాంగ సూత్రాలకు సమాధి

రాజ్యాంగానికి సవరణ చేసేందుకు పార్లమెంటుకు గల అధికారాలు, అందుకు అనుసరించవలసిన విధానాన్ని అధికరణ 368 విశదీకరించింది...

రాజ్యాంగానికి సవరణ చేసేందుకు పార్లమెంటుకు గల అధికారాలు, అందుకు అనుసరించవలసిన విధానాన్ని అధికరణ 368 విశదీకరించింది. ఆ అధికరణ లోని నిబంధన 2, ఇతర విషయాలతో పాటు ఇలా ఉన్నది: 'రాజ్యాంగంలో ఏమి పేర్కొన్నప్పటికీ ఈ రాజ్యాంగంలోని ఏ అంశాన్ని అయినా సవరించే, లేక మార్పు చేసే, లేక తొలగించే రాజ్యాంగబద్ధమైన అధికారం పార్లమెంటుకు ఉంటుంది. రాజ్యాంగ సవరణ విధానం ఈ క్రింద ఉదహరింపబడిన విధంగా ఉంటుంది. "రాజ్యాంగ సవరణకు ఉద్దేశించిన బిల్లును లోక్‌సభలో గాని, లేక రాజ్యసభలో గాని మాత్రమే ప్రవేశపెట్ట వలెను. ఆ బిల్లును సభకు హాజరైన వారిలో మూడింట రెండు వంతుల మంది ఆమోదించవలెను. ఆ విధంగా ఆమోదించిన వారి సంఖ్య సభ మొత్తం సభ్యుల సంఖ్యలో సగం కన్న ఎక్కువగా ఉండవలెను. లోక్‌సభలోను, రాజ్యసభలోను ఇదే విధంగా ఆమోదింపవలెను. ఆ విధంగా రెండు సభలు ఆమోదించిన తరువాత ఆ బిల్లును రాష్ట్రపతికి పంపవలెను. రాష్ట్రపతి ఆ బిల్లును తప్పనిసరిగా ఆమోదించవలెను. అప్పుడు బిల్లులో ఉదహరింపబడిన విధంగా రాజ్యాంగం సవరింపబడుతుంది".రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందగల సంఖ్యా బలం ఎన్డీఏ ప్రభుత్వానికి పార్లమెంటు ఉభయ సభలలోనూ లేదు. లోక్‌సభలో ఎన్డీఏ సభ్యులు 293 (మొత్తం సభ్యుల సంఖ్య 543) మంది మాత్రమే కాగా రాజ్యసభలోనూ పాలక కూటమికి కేవలం 133 మంది సభ్యులే (మొత్తం సభ్యుల సంఖ్య 245) ఉన్నారు. ఏ సభలో నైనా ఒక బిల్లు ఆమోదం పొందాలంటే, సభ్యులు అందరూ సభకు హాజరై బిల్లుపై ఓటింగ్‌లో పాల్గొంటే మూడింట రెండు వంతుల మంది సభ్యులు బిల్లుకు అనుకూలంగా ఓటువేసినప్పుడు మాత్రమే అది చట్ట ప్రతిపత్తి పొందడానికి అర్హమవుతుంది (ఓటింగ్‌కు హాజరైన వారిలో మూడింట రెండు వంతుల మంది ఆ సవరణ బిల్లును ఆమోదించాలి. ఆ విధంగా ఆమోదించిన వారి సంఖ్య మొత్తం సభలోని స్థానాలలో సగం కన్నా ఎక్కువగా ఉండాలి. ఉదాహరణకు ఒక సభలో మొత్తం సభ్యుల సంఖ్య 300 అనుకుందాం. సభకు 150 మంది హాజరయినారు. వారిలో 100 మంది ఆ సవరణను ఆమోదించారు. అయినా ఆమోదించినట్లు కాదు. ఎందుకంటే ఆ సవరణ మొత్తం సభ్యులలో మెజారిటీ ఆమోదం పొందలేదు కనుక. సభకు కనీసం 200 మంది హాజరై వారిలో 151 మంది ఆ సవరణను ఆమోదిస్తే సభ ఆమోదం పొందినట్లుగా పరిగణితమవుతుంది. ఉభయ సభలలోను ఇదే విధంగా ఆమోదం పొందాలి. ఇలా ఏ సభలోను ఆమోదం పొందలేక పోతే రాజ్యాంగ సవరణ వీగిపోయినట్లే). అయితే ప్రస్తుత రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందేందుకు అవసరమైన మెజారిటీ పాలక ఎన్డీఏకు ఏ సభలోనూ లేదు.


ప్రతిపక్షాలు అన్నిటికీ కలిపి లోక్‌సభలో 250 మంది సభ్యులు, రాజ్యసభలో 120 మంది సభ్యులు మాత్రమే ఉన్నారు. కనుక ఆ రాజ్యాంగ సవరణ బిల్లు ఏ సభలోను ఆమోదం పొందలేదు. లోక్‌సభలో 182 మంది సభ్యులు, రాజ్యసభలో 82 మంది సభ్యులు ఆ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేస్తే అది ఆమోదం పొందదు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ప్రతిపక్షాలు అన్నీ ఎన్డీఏకు వ్యతిరేకంగా లేవు. వైఎస్ఆర్‌సీపీ, బిజూ జనతాదళ్, భారత రాష్ట్ర సమితి, బహుజన్ సమాజ్ పార్టీ, ఇంకా కొన్ని చిన్న పార్టీలు ఎన్డీఏ ప్రభుత్వానికే మద్దతునిస్తున్నాయి. ఏఐటీసీ, ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్డీఏను వ్యతిరేకిస్తున్నాయి. అయితే ఇండియా కూటమికి వాటి మద్దతు అంశాల ప్రాతిపదికన ఉంటుంది. ఈ పరిస్థితులలో ఎన్డీఏ ప్రభుత్వం 'రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు–2025'ని పార్లమెంటులో ప్రవేశపెట్టింది. వెన్వెంటనే ఆ బిల్లును సంయుక్త పార్లమెంటరీ సంఘం పరిశీలనకు నివేదించారు. చాలా సరళంగా కన్పిస్తున్న ఈ బిల్లు లక్ష్యమేమిటి? ఐదు సంవత్సరాలు, అంతకు మించి జైలుశిక్షకు అర్హమయ్యే నేరాభియోగాలతో అరెస్టయిన మంత్రులు (ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి సైతం) జైలులో 30రోజులు ఉంటే పదవీచ్యుతులు అవుతారు. ఆ ముప్ఫై రోజులలో దర్యాప్తు పూర్తికావడం అసాధ్యం. చార్జిషీటును దాఖలు చేయడమూ జరిగే పని కాదు. ఆరోపణలు ఉండవు, విచారణ జరగదు, శిక్ష నిర్ధారణ కాదు. అయినప్పటికీ 31వ రోజున 'నేరస్తుడు' అనే కళంకంతో పదవిని కోల్పోతాడు! ఈ రాజ్యాంగ సవరణ బిల్లు రాజ్యాంగ, రాజకీయ నైతికతకు పరాకాష్ఠ అని భారతీయ జనతా పార్టీ ఘోషిస్తోంది. ఏమిటి ఆ పార్టీ వాదన? 'అవినీతిపరుడు' అయిన ఒక మంత్రిని పదవి నుంచి తొలగించడం కంటే ఉన్నతాదర్శం మరేముంటుంది?

-ఎడిటర్

## అవసరమైతే అధ్యక్ష బాధ్యతలకు సిద్ధం



అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒక వేళ అనుకోని ఘోరమైన విషాదం జరిగితే దేశ అధ్యక్షుడి బాధ్యతలు చేపట్టేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. అయితే అ?ధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్(79) ఆరోగ్యం చాలా బాగుందని చెప్పారు. ఆయన తన పూర్తి పదవీ కాలం బాధ్యతలు నిర్వర్తిస్తారని తాను విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. 'యూఎసఏ టుడే'కి గురువారం ఇచ్చిన ఇంటర్వ్యూలో వాన్స్ ట్రంప్ ఆరోగ్యంపై వస్తోన్న వదంతులను కొట్టి పారేశారు. అయితే ప్రస్తుతం తానున్న పదవి రీత్యా అనుకోనిది జరిగితే అధ్యక్ష బాధ్యతలు చేపట్టడానికి సన్నద్ధం అయినట్లు తెలిపారు. కాగా, తన తర్వాత 'మేక్ అమెరికా గ్రేట్ ఎగెయిన్'(మాగా) ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లగలవారిలో వాన్సే ముందుంటారని.. ట్రంప్ 2028లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో వాన్స్ అభ్యర్థిత్వంపై ఆశలు రేపారు.




ప్రపంచ ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ఉంచాలంటే భారత్, చైనా కలిసి పనిచేయడం అవసరమని ప్రధాని మోదీ చెప్పారు. పరస్పర గౌరవం, ప్రయోజనం, సున్నితత్వం ఆధారంగా ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక, దీర్ఘకాలిక సంబంధాలను పెంపొందించుకునేందుకు భారత్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం జపాన్ వెళ్లిన మోదీ.. శుక్రవారం స్థానిక పత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. భారత్, చైనాలు ప్రపంచంలోనే అతిపెద్ద దేశాలని గుర్తుచేశారు. రెండు దేశాల మధ్య స్థిరమైన, బలమైన బంధాలు ఉండాలని.. ఆ ప్రభావం ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి, సౌభ్రాతృత్వంపైనా ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం చైనాతో సంబంధాలు మెరుగుపర్చుకోవడంపై అడిగిన ప్రశ్నకు మోదీ స్పందిస్తూ.. "చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆహ్వానం మేరకు షాంఘై సహకారం సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో పాల్గొనడానికి తియాంజిన్ వెళు తున్నా. గత ఏడాది కజాన్‌లో జిన్‌పింగ్‌తో సమావేశం అయ్యాను. అప్పటి నుంచి ఇరుదేశాల మధ్య సంబంధాల్లో స్థిరమైన, సానుకూల పురోగతి ఉంది" అని చెప్పారు. ఇరుదేశాల మధ్య దృఢమైన బంధం ఆసియాకే గాక యావత్ ప్రపంచానికే కీలకమని వ్యాఖ్యాని ంచారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అస్థిరంగా ఉందని.. ఈ పరిస్థితుల్లో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన భారత్, చైనా కలిసి ట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. జపాన్ ప్రభుత్వ 'స్వేచ్ఛాయుత, బహిరంగ ఇండో–పసిఫిక్' విధానంపై స్పందిస్తూ.. ఈ విధానానికి, భారత్ 'విజన్ మహాసాగర్'కు సారూప్యత ఉందని మోదీ చెప్పారు. ప్రధాని మోదీ భారత్–జపాన్ సంయుక్త ఆర్థిక సదస్సులో ప్రసంగిస్తూ.. మేకిన్ ఇండి యా కోసం రావాలని, ప్రపంచం కోసం తయారీ చేపట్టాలని వ్యాపారవేత్తలకు పిలుపునిచ్చారు. సెమీ కండక్టర్ పరిశ్రమల నుంచి స్టార్టప్‌ల వరకూ భారత్‌కు జపాన్ అత్యంత కీలక భాగస్వామిగా ఉందని చెప్పారు. జపాన్ సంస్థలు భారత్‌లో రూ.3.50 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టాయని గుర్తుచేశారు. "ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ భారత్. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుంది" అని మోదీ పేర్కొన్నారు. జపాన్ సాంకేతికత, భారతీయుల ప్రతిభ కలిస్తే ఈ శతాబ్దపు సాంకేతిక విప్లవాన్ని ముందుకు నడిపించగలవని అన్నారు. ముంబై–అహ్మదాబాద్ బుల్లెట్ రైలు భారత్, జపాన్‌ల మధ్య ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అని ప్రధాని మోదీ చెప్పారు. మరికొన్ని ఏళ్లలోనే రైలు సేవలను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. మరోవైపు, చంద్రుడిపై పరిశోధనల కోసం చేపడుతున్న చంద్రయాన్–5 మిషన్ కోసం జపాన్‌తో కలిసి పనిచేయనున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ఇందుకోసం ఇరుదేశాల అంతరిక్ష సంస్థలు ఇస్రో, జాక్సాల మధ్య ఒప్పందం కుదిరినట్లు తెలిపారు. పదేళ్లలో రూ.6 లక్షల కోట్ల పెట్టుబడులు..భారత్‌లో రాబోయే పదేళ్లలో దాదాపు రూ.6 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టాలని జపాన్ లక్ష్యంగా పెట్టుకుంది. కీలక గనులు, రక్షణ, సాంకేతిక రంగాల్లో ఇరుదేశాల మధ్య సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని నిర్ణ యించాయి. జపాన్ ప్రధాని షిగెరు ఇషిబాతో జరిగిన చర్చల్లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు మోదీ తెలిపారు. ఏఐ, సెమీ కండక్టర్లు, బుల్లెట్ రైలు, స్వచ్ఛ ఇంధనం, టెలికం, ఫార్మా, సరికొత్త, అధునాతన సాంకేతికత తదితర రంగాల్లో ఇరు దేశాల మధ్య 13 ఒప్పందాలు జరిగాయి. జపాన్ పర్యటనను ముగించుకొని మోదీ చైనా వెళ్లనున్నారు. ఆగస్టు 31, సెప్టెంబరు 1న తియాంజిన్‌లో జరిగే ఎస్‌సీవో శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొంటారు. అక్కడ జిన్‌పింగ్‌తో భేటీ కానున్నారు. 2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత మోదీ చైనా పర్యటనకు వెళ్లడం ఇదే మొదటిసారి.

మరోవైపు, రష్యా అధ్యక్షుడు పుతిన్ సోమవారం మోదీతో సమావేశమనున్నట్లు క్రెమ్లిన్ వర్గాలు తెలిపాయి. అలాగే, డిసెంబరులో పుతిన్ భారత్‌లో పర్యటించనున్నారు. రష్యా చమురును కొంటున్నందుకే ట్రంప్ భారత్‌పై సుంకాలు విధించిన సంగతి తెలిసిందే.

## సుంకాలు అమల్లోనే ఉన్నాయి.. కోర్టు తీర్పుపై డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన



సుంకాల విధింపు చట్టవ్యతిరేకమంటూ స్థానిక కోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. సుప్రీం కోర్టు తుది తీర్పు ఇచ్చే వరకూ సుంకాలు అమల్లోనే ఉంటాయని స్పష్టం చేశాయి. వివిధ దేశాలపై అమెరికా విధించిన సుంకాలు అమల్లోనే ఉన్నాయని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం సోషల్ మీడియాలో స్పష్టం చేశారు. సుంకాలు చట్టవ్యతిరేకమంటూ అప్పీల్స్ కోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో ట్రంప్ ఈ వివరణ ఇచ్చారు. సుంకాలు చట్ట వ్యతిరేకమన్న న్యాయస్థానం తీర్పుపై సుప్రీం కోర్టులో సవాలు చేసేందుకు ట్రంప్ సర్కారుకు కొంత గడువిచ్చింది. 'అన్ని సుంకాలు అమల్లోనే ఉన్నాయి.

సుంకాలు తొలగించాలంటూ అప్పీల్స్ కోర్టు అసంబద్ధమైన తీర్పు ఇచ్చింది. కానీ ఈ తుదకు విజయం అమెరికాదే. ఈ సుంకాలను తొలగిస్తే దేశానికి తీవ్ర నష్టం జరుగుతుంది. ఆర్థికంగా మనం బలహీనపడతాం. మనం ధైరంగా నిలబడాలి' అని ఆయన తన సోషల్ మీడియా ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. వాణిజ్య లోటు, ఇతర దేశాలు తమపై అన్యాయంగా విధిస్తున్న సుంకాలను అమెరికా ఇక ఎంతమాత్రం సహించదని ట్రంప్ స్పష్టం చేశారు. మిత్ర దేశమైనా ప్రత్యర్థి దేశమైనా అమెరికా కంపెనీలు, రైతులు, ఇతరులకు వాణిజ్య పరమైన అడ్డంకులు సృష్టిస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. సుంకాలు రద్దు చేసిన కోర్టు తీర్పును అంగీకరిస్తే అమెరికా నాశనం అవుతుందని హెచ్చరించారు. మేడ్ ఇన్ అమెరికా ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు, అమెరికా ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు ఇతర దేశాలపై సుంకాల విధింపు తప్పనిసరి అని ట్రంప్ వాదిస్తున్న విషయం తెలిసిందే. ట్రంప్ అధ్యక్ష పదవి చేపట్టి దాదాపు 7 నెలలు అవుతోంది. రెండో సారి అధికారంలోకి వచ్చాక డొనాల్డ్ ట్రంప్ సుంకాలనే ప్రధాన ఆయుధంగా మలుచుకున్నారు. సుంకాల బెదిరింపుతో పలు దేశాలను లొంగదీసుకుని డీల్స్ కుదుర్చుకునే ప్రయత్నం చేయడం, లొంగని దేశాలపై భారీగా సుంకాలను పెంచడం చేస్తున్నారు. దీనిపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అమెరికాలోనే ట్రంప్ సర్కారు నిర్ణయంపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రస్తుతం భారత్, బ్రెజిల్ ఉత్పత్తులపై ట్రంప్ సర్కారు ఏకంగా 50 శాతం సుంకం విధిస్తోంది.

## ఒమన్‌తో త్వరలోనే వాణిజ్య ఒప్పందం



అమెరికా టారిఫల నేపథ్యంలో కేంద్రం ఆయా పరిశ్రమలకు కొత్త మార్కె ట్లు తీసుకొచ్చేందుకు వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరుపుతోంది. .. అమెరికా టారిఫల నేపథ్యంలో కేంద్రం ఆయా పరిశ్రమలకు కొత్త మార్కె ట్లు తీసుకొచ్చేందుకు వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరుపుతోంది. ఒమన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం త్వరలోనే ఖరారు కానుందని.. సౌదీ అరేబియా, ఖతార్ కూడా భారత్‌తో ఒప్పందాలపై చర్చలు జరపాలనుకుంటున్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఒక దేశం ఏకపక్ష చర్యల కారణంగా వాణిజ్య రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన అనిశ్చితులను ఎదుర్కోవడానికి ఎగుమతిదారులకు అన్ని రకాల మద్దతునిస్తామని చెప్పారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం యూరోపియన్ యూనియన్‌తోనూ చర్చలు ఊపందుకున్నాయన్నా రు. 'ప్రపంచ వాణిజ్యంలో భారత్ వాటా 2 శాత మే. అమెరికాకు ఎగుమతి చేసే వాటిలో దాదాపు 40% వస్తువులు 50% సుంకాల పరిధిలోకి రావు. దీంతో ప్రభావం తక్కువే..' అని వివరించారు.




థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రాపై ఆ దేశ రాజ్యాంగ న్యాయస్థానం వేటు వేసింది. ఆమెను పదవి నుంచి తొలగిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చింది. పేటోంగ్టార్న్ నైతిక ప్రమాణాల ఉల్లంఘనకు పాల్పడినట్లు రుజువైందని పేర్కొంది. కంబోడియాతో సరిహద్దు ఉద్రిక్తతల సమయంలో ఆ దేశ నేత హున్ సేన్‌తో మాట్లాడిన ఓ ఫోన్‌కాల్ ఆమె పదవికి ఎసరు తెచ్చింది. జూన్‌లో వీరిద్దరి మధ్య జరిగిన ఫోన్ సంభాషణ లీక్ అయింది. ఆ కాల్‌లో హున్ సేన్‌ను పేటోంగ్టార్న్ 'అంకుల్'గా సంభోదించారని, థాయ్ సీనియర్ మిలటరీ కమాండర్‌ను విమర్శించారని అంతర్జాతీయ మీడియా సంస్థలు నివేదించాయి. అయితే ఆ తర్వాత తన వ్యాఖ్యలపై పేటోంగ్టార్న్ క్షమాపణలు చెప్పారు. కాగా, శ్రేత్త థావిసిన్ స్థానంలో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన పేటోంగ్టార్న్ షినవత్రా దాదాపు ఏడాది పాటు పదవిలో కొనసాగారు. థావిసిన్‌ను కూడా రాజ్యాంగ న్యాయస్థానమే పదవి నుంచి తప్పించింది. ఇప్పుడు షినవత్రాపై వేటు నేపథ్యంలో ఆ దేశ పార్లమెంట్ కొత్త ప్రధానిని ఎన్నుకోవాల్సి ఉంది.

# నిజాంపేట జర్నలిస్ట్ కాలనీలో గణేష్ ఉత్సవాలు

### అన్నదానం నిర్వహించిన ఆస్కాని మారుతి సాగర్ దంపతులు



**నిజాంపేట్, ప్రజాజ్వాల:**
విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖఃసంతోషాలతో సుభిక్షంగా వర్ధిల్లాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్, మాధవి దంపతులు ఆకాంక్షించారు. శనివారం నిజాంపేట జర్నలిస్ట్ కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుని వద్ద తమ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. తదనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# గణేష్ ఉత్సవాలలో కొలన్ హన్మంత్ రెడ్డి ప్రత్యేక పూజలు



**కుత్బుల్లాపూర్,ప్రజాజ్వాల:**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి లో ఏర్పాటు చేసిన పలు వినాయకుని అన్నదానం, నిమర్జన కార్యక్రమంలో కమిటీ వారి ఆహ్వానం మేరకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామివారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు ఆరోగ్యంగా, సుభిక్షంగా ఉండాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, కొలన్ జీవన్ రెడ్డి, కొలన్ బాల్ రెడ్డి, ఎన్ఎంసి మహిళ అధ్యక్షురాలు ఇందిరా కడియాల, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కమిటీ వాసులు పాల్గొన్నారు.

# గుడివాడ విగ్నేశ్వర స్వామి వద్ద ప్రత్యేక పూజలు

### నిర్వహించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ జానకిరామ్ రెడ్డి



**జనగామ జిల్లా, ప్రజాజ్వాల:**
పాలకుర్తి మండల కేంద్రంలోని గుడివాడ చౌరస్తాలో గత కొద్ది సంవత్సరాలుగా అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య పూజలు అందుకుంటూ కొలువై ఉన్నటువంటి గుడివాడ విగ్నేశ్వర స్వామి వారిని దర్శించుకున్న పాలకుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ జానకిరామ్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# గణనాథుడికి జెకె శేఖర్ యాదవ్ ప్రత్యేక పూజలు






**కుత్బుల్లాపూర్, ప్రజాజ్వాల:**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలో ఏర్పాటు చేసిన పలు వినాయకుని అన్నదాన, నిమజ్జన కార్యక్రమంలో కమిటీ వారి ఆహ్వానం మేరకు శనివారం ముఖ్య అతిథులుగా పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిజెపి పార్టీ కన్వీనర్ జె కె శేఖర్ యాదవ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు ఆరోగ్యంగా, సుభిక్షంగా ఉండాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బిజెపి నాయకులు, కమిటీ సభ్యులు, ఇతర పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పాల డైరీ ఫామ్ పై సిసిఎస్ పోలీసుల దాడి

**-కల్తీ నెయ్యి చేస్తున్నారన్న అనుమానంతో పోలీసుల దాడి**
**-210 కిలోల కల్తీ అని అనుమానిస్తున్న నెయ్యి స్వాధీనం పోలీస్ స్టేషన్ కు తరలింపు.**







**హత్నూర, ప్రజాజ్వాల:**
కల్తీ నెయ్యి చేస్తున్నారన్న అనుమానంతో సిసిఎస్ పోలీసులు దాడి చేసి సుమారు 210కేజీల నెయ్యిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన హత్నూర మండలం గోవిందరాజు పల్లి గ్రామ శివారులోని మధుప్రియ పాల డైరీ ఫామ్ పై సిసిఎస్ పోలీసులు శనివారం దాడి చేశారు. 10 కేజీల నెయ్యి బకెట్లు 16, 30లీటర్ల పెద్ద క్యాన్లు రెండు, కాటన్ మంచి నూనె ప్యాకెట్లు, కాన్ ఫ్లోర్ పౌడర్, టెస్టింగ్ సాల్ట్ ప్యాకెట్, మిల్క్ పౌడర్, బోకింగ్ సోడా, ఇతర కెమికల్ వస్తువులను సిసిఎస్ పోలీసులు స్వాధీనం చేసుకొని స్థానిక ఎస్సై శ్రీధర్ రెడ్డికి అప్పగించినట్లు తెలిసింది. మధు ప్రియ పాల డైరీ నిర్వహకుడితో పాటు ఆటోను కల్తీ నెయ్యిగా భావిస్తున్న డబ్బాలను హత్నూర పోలీస్ స్టేషన్ కు ఎస్సై శ్రీధర్ రెడ్డి తీసుకెళ్లారు. ఈ విషయమై ఎస్సై శ్రీధర్ రెడ్డిని సంప్రదించగా స్వాధీనం చేసుకున్న వాటిని స్టేషన్లో ఉంచామని ఫుడ్ ఇన్స్పెక్టర్ వచ్చిన తర్వాత ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

# శ్రీ విఘ్నేశ్వరుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

**-కెయం ప్రతాప్**
**-వినాయకుడికి కెయం ప్రతాప్ ప్రత్యేక పూజలు**



**కుత్బుల్లాపూర్,ప్రజాజ్వాల:**
శ్రీ వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో రాజీవ్ యూత్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కెయం ప్రతాప్ విచ్చేసి విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ.. శ్రీ విఘ్నేశ్వరుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని,ఆయురారోగ్యాలు అష్టై ఐశ్వర్యాలు కలిగించాలని వేడుకున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు నక్క ప్రకాష్, సత్ గ్యాన్ హై స్కూల్ కరస్పాండెంట్ చింతల మల్లేశం,ఉప్పల భాస్కర్, ఏనుగుల కృష్ణ, ముస్తఫా,నక్క నాగరాజ్, నక్క ఫణీంద్ర, సునీల్, గౌరీష్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

# భాషితలో స్వాగతోత్సవ సంబరాలు

-కెరీర్ కు టర్నింగ్ పాయింట్ ఇంటర్ విద్య
-ప్రత్యేక శ్రద్ధతో చదివితే ఉజ్వల భవిష్యత్తు
-పద్మశ్రీ అవార్డు గ్రహీత కిన్నెర మొగులయ్య
-ఘనంగా భాషిత జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే
-ముఖ్య అతిథిగా హాజరైన పద్మశ్రీ మొగులయ్య
-ఆటపాటలతో అలరించిన విద్యార్థిని విద్యార్థులు










**కుత్బుల్లాపూర్, ప్రజాజ్వాల:**
కెరీర్ టర్నింగ్ పాయింట్ గా ఇంటర్మీడియట్ విద్య కీలకమైన దశ అని, ఈ దశలో విద్యార్థిని విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధతో చదివితే ఉన్నతమైన ఉజ్వల భవిష్యత్తును కైవసం చేసుకోవడం జరుగుతుందని పద్మశ్రీ అవార్డు గ్రహీత కిన్నెర మొగులయ్య తెలిపారు. శనివారం ఐడిపిఎల్ క్రాజ్ రోడ్ కు చెందిన భాషిత జూనియర్ కళాశాలలో స్వాగతోత్సవం(ఫ్రెషర్స్ డే) వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మశ్రీ కిన్నెర మొగులయ్య హాజరై ప్రసంగించారు. ఇంటర్ స్థాయిలో అత్యధిక శ్రద్ధ, కఠిన శ్రమతో మంచి ర్యాంకులు సాధించాలని, ఐఐటి, నీట్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. బీమ్లా నాయక్ పాట పాడి విద్యార్థులను ఆహుతులను సంతోషపరిచారు. ఈ వేడుకకు ప్రత్యేక అతిథులుగా జబర్దస్త్ ఫేమ్ ఆనంద్, అప్పారావు పాల్గొని హాస్యభరిత నాటికలతో అలరించారు. విద్యార్థిని విద్యార్థులు పలు రకాల సాంస్కృతిక ఆటపాటలతో అలరించారు. నూతన విద్యార్థులకు సీనియర్లు ఆహ్వానం పలుకుతూ ఉపన్యాసాలు చేశారు. ఈ కార్యక్రమంలో భాషిత జూనియర్ కళాశాల చైర్మన్ డాక్టర్ డి సత్యనారాయణ, డైరెక్టర్ టి హేమలత, కరస్పాండెంట్ టి శైలజ, యాజమాన్య సభ్యులు టి శ్రీవిద్య , టి క్రిష్ణ పాల్గొని సహాయ సహకారాలు అందించిన కళాశాల సిబ్బంది,తల్లిదండ్రులకు యాజమాన్యం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# అర్హులైన ప్రతి ఒక్కరూ సిఎంఆర్ఎఫ్ సద్వినియోగం చేసుకోవాలి

**-బిఆర్ఎస్ నాయకులు...**



**జగద్గిరిగుట్ట, ప్రజాజ్వాల:**
ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరిని ఆదుకునే నాయకులు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ అని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఆపద సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు అన్నారు. జగదిరిగుట్ట డివిజన్ పాపిరెడ్డి నగర్ కు చెందిన వనసర్ల గంగా లక్ష్మి భర్త వెంకట రామన్ (45), అంజయ్య నగర్ కు చెందిన క్రిష్ణ బిట్టు తండ్రి బాలరాజు (17), రంగారెడ్డి నగర్ డివిజన్ గిరి నగర్ కు చెందిన అఫ్రీన్ బేగం భర్త మీర్జా కుదుస్ బెగ్ (43),ఇందిరా గాంధీ నగర్ కు చెందిన భాగ్యలక్ష్మి భర్త గోపాల్ (41) లకు ఆరోగ్య పరిస్థితి బాగాలేదని స్థానిక నాయకులు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ప్రత్యేక చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లబ్ధిదారులు ధనలక్ష్మికి 2లక్షలు, కృష్ణ బిట్టుకు 1లక్షలు, భాగ్య లక్ష్మీకి 2లక్షలు, అఫ్రీన్ బేగంకు 2లక్షలు మంజూరు చేయించి శనివారం చింతల్ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో స్థానిక బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకుల చేతులమీదుగా లబ్ధిదారుల కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, ఎర్వ శంకరయ్య, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు సుధాకర్, గుబ్బల లక్ష్మీనారాయణ, మెట్ల శీను, జల్దా లక్ష్మీనాథ్, క్రాంతి యాదవ్, రమ్మీ గౌడ్, అల్లావుద్దీన్, శ్రీనివాస్, విత్తనాల భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కళాశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం




**రాజేంద్రనగర్, ప్రజాజ్వాల:**
రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ జోన్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ (ఐపిఎస్) హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల ప్రాముఖ్యత, శారీరక ఆరోగ్యం, క్రమశిక్షణ, జట్టు భావన, మరియు విద్యార్థి జీవనంలో క్రీడలు కలిగించే విలువల గురించి వివరించారు. చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా వివిధ క్రీడా పోటీలు, ఆటలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలు మరియు రన్నరప్‌లకు బహుమతులను శ్రీనివాస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ గోవర్ధన్, రామ్ రెడ్డి, క్రీడల ఇన్‌ఛార్జ్ సైదా నాయక్, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొని క్రీడల ప్రాముఖ్యతపై అవగాహన పొందారు.



## క్రికెట్ చరిత్రలోనే ఇది ఫస్ట్ టైం.. మ్యాచ్ ముందు షాకింగ్ ఘటన.. పిచ్?కి నిప్పంటించిన గ్రౌండ్ సిబ్బంది

కెనడాలోని కింగ్ సిటీలో ఉన్న మాపుల్ లీఫ్ నార్త్-వెస్ట్ గ్రౌండ్‌లో క్రికెట్ వరల్డ్ కప్ లీగ్ 2లో భాగంగా నమీబియా, స్కాట్లాండ్ మధ్య జరగాల్సిన మ్యాచ్‌కు ముందు మైదాన సిబ్బంది విచిత్రంగా ప్రవర్తించారు. వర్షం ఆగిన తర్వాత గ్రౌండ్ సిబ్బంది పిచ్‌పై నిప్పులు పెట్టడం సోషల్ మీడియాలో వైరల్ అయింది. కెనడాలోని కింగ్ సిటీలో జరిగిన ఐసీసీ వరల్డ్ కప్ లీగ్ 2 మ్యాచ్‌లో నమీబియా, స్కాట్లాండ్ జట్ల మధ్య వింత ఘటన జరిగింది. వర్షం తర్వాత గ్రౌండ్ సిబ్బంది పిచ్‌పై నిప్పు పెట్టారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ కారణంగా మ్యాచ్ రద్దయింది. భారీ వర్షాల కారణంగా మ్యాచ్ ప్రారంభం ఆలస్యమైంది. చాలాసార్లు పిచ్‌ను పరిశీలించిన తర్వాత కూడా, అది ఆటకు అనుకూలంగా లేదని గుర్తించారు. కొద్దిసేపటి తర్వాత గ్రౌండ్ సిబ్బంది పిచ్‌ను త్వరగా ఆరిపోయేలా చేయడానికి దానిపై నిప్పు అంటించారు. దీనిని చూసి ఆటగాళు కూడా ఆశ్చర్యపోయారు. ఈ వింత పద్ధతితో కూడా పిచ్ సిద్ధం కాకపోవడంతో మ్యాచ్ రద్దయింది. స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 9:02 గంటల వరకు మ్యాచ్ ప్రారంభం కావాల్సి ఉంది, కానీ అది సాధ్యం కాలేదు. ఈ మ్యాచ్‌కు ముందు నమీబియా, స్కాట్లాండ్ జట్ల ప్రదర్శనలు విరుద్ధంగా ఉన్నాయి. నమీబియా కెనడాను ఐదు వికెట్ల తేడాతో ఓడించింది. మరోవైపు, స్కాట్లాండ్ 369 పరుగులు చేసినప్పటికీ, నెదర్లాండ్స్ జట్టు నాలుగు వికెట్ల తేడాతో గెలిచింది. డచ్ జట్టు నాలుగు బంతులు మిగిలి ఉండగానే ఈ భారీ లక్ష్యాన్ని ఛేదించింది.నమీబియా, స్కాట్లాండ్ జట్లు వరుసగా సెప్టెంబర్ 2, ఆగస్టు 30న కెనడాతో తలపడనున్నాయి. నమీబియా 2027 వరల్డ్ కప్‌ను దక్షిణాఫ్రికా, జింబాబ్వేతో కలిసి నిర్వహించనుంది. అయితే, నమీబియాకు వరల్డ్ కప్‌లో ఆడేందుకు హామీ లేదు. ఎందుకంటే వారు పూర్తి ఐసీసీ సభ్యులు కాదు, కాబట్టి వారు అర్హత ప్రక్రియ ద్వారానే వరల్డ్ కప్‌లోకి రావాలి.నమీబియా చివరిసారిగా 50 ఓవర్ల వరల్డ్ కప్‌లో 2003లో ఆడింది. స్కాట్లాండ్ కూడా ఈసారి టోర్నమెంట్‌లో తమ ప్రదర్శనను నిరూపించుకోవాలని కోరుకుంటోంది.

## ఆసియా కప్ కోసం కోచ్‌గా గంభీర్.. స్పెషల్ రోల్‌లో ధోని.. బీసీసీఐ మాస్టర్ ప్లాన్






2026 టీ20 వరల్డ్ కప్‌కు కొన్ని నెలల ముందు భారత క్రికెట్‌లో సంచలనం సృష్టించే ఒక వార్త బయటపడింది. ఒక నివేదిక ప్రకారం, బీసీసీఐ ఎంఎస్ ధోనికి మళ్లీ మెంటార్ పాత్ర ఇవ్వాలని భావిస్తోంది. ఇంతకు ముందు 2021 టీ20 వరల్డ్ కప్ సమయంలో ధోని టీమిండియాకు మెంటార్‌గా ఉన్నాడు. టీ20 వరల్డ్ కప్ 2026కు కొన్ని నెలల ముందు భారత క్రికెట్‌లో సంచలనం సృష్టించే ఒక వార్త వెలువడింది. ఒక నివేదిక ప్రకారం.. బీసీసీఐ ఎంఎస్ ధోనిని మళ్లీ టీమిండియా మెంటార్‌గా నియమించాలని చూస్తోంది. ధోని గతంలో 2021 టీ20 వరల్డ్ కప్ సమయంలో భారత జట్టుకు మెంటార్‌గా వ్యవహరించాడు. ఆ సమయంలో రవిశాస్త్రి హెడ్ కోచ్‌గా ఉన్నారు. నివేదికల ప్రకారం.. ధోనికి ఆఫర్ ఇప్పటికే ఇచ్చారు. అయితే, అతను ఈ ఆఫర్‌ను రిజెక్ట్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. టీమిండియాకు ధోని మెంటార్ అవుతాడా?

బీసీసీఐ అధికారి తెలిపిన వివరాల ప్రకారం.. ఎంఎస్ ధోని మెంటార్‌గా భారత క్రికెట్‌లో నెక్స్ట్ జనరేషన్ టీంను రెడీ చేయడంలో సాయపడగలడు అని అన్నారు. అయితే, ధోని ఈ ఆఫర్‌ను అంగీకరించకపోవడానికి ప్రధాన కారణం గౌతమ్ గంభీర్ కావచ్చు అని ఆ అధికారి చెప్పాడు. 2021లో ధోని మెంటార్‌గా ఉన్నప్పుడు, భారత జట్టు టీ20 వరల్డ్ కప్ సెమీఫైనల్‌కు కూడా వెళ్లలేకపోయింది. కొన్ని ఇతర నివేదికల ప్రకారం.. ధోని ఐపీఎల్ 2026 తర్వాత ఐపీఎల్‌కు కూడా గుడ్ బై చెప్పే అవకాశం ఉంది. ఐపీఎల్ 2026 టీ20 వరల్డ్ కప్ 2026 ముగిసిన తర్వాత నెలలోనే ప్రారంభమవుతుంది. యువ ఆటగాళ్లకు ధోని సలహాలు ఎంతో సహాయపడతాయనడంలో సందేహం లేదు. కానీ, అతని ఆలోచనా విధానం గౌతమ్ గంభీర్ కంటే భిన్నంగా ఉండవచ్చు.మొదటి టీ20 వరల్డ్ కప్ 2007లో జరిగింది. ఫైనల్‌లో భారత్ పాకిస్తాన్‌ను 5 పరుగుల తేడాతో ఓడించి చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత 2014లో ధోని కెప్టెన్సీలోనే భారత జట్టు టీ20 వరల్డ్ కప్ ఫైనల్ ఆడింది. దురదృష్టవశాత్తు.. ఆ మ్యాచ్‌లో టీమిండియా 6 వికెట్ల తేడాతో ఓడిపోయింది.

## ఇక్కడ వానలు.. అక్కడ మండుతున్న ఎండలు.. ఆసియా కప్ మ్యాచ్ టైమింగ్స్‌లో మార్పు



ఆసియా కప్ 2025 ప్రారంభానికి మరికొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. సెప్టెంబర్ 9 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నమెంట్‌లో ఆసియాలోని 8 జట్లు తలపడతాయి. అయితే, టోర్నమెంట్ మొదలవడానికి ముందే ఒక పెద్ద అప్డేట్ వచ్చింది. ఆసియా కప్‌లోని మ్యాచ్‌ల సమయాలను మార్చారు.ఆసియా కప్ 2025 ప్రారంభానికి మరికొన్ని రోజులే మిగిలి ఉన్నాయి. ఈ టోర్నమెంట్ సెప్టెంబర్ 9 నుంచి మొదలవుతుంది. ఇందులో ఆసియాలోని 8 జట్లు తలపడనున్నాయి. అయితే, టోర్నమెంట్ ప్రారంభానికి ముందు ఒక పెద్ద అప్‌డేట్ వచ్చింది. ఆసియా కప్ మ్యాచ్‌ల సమయాలలో ఒక ముఖ్యమైన మార్పు చేశారు. ఈ టోర్నమెంట్ యూఏఈ (దుబాయ్)లో జరుగుతుంది. నిజానికి, ఈ మ్యాచ్‌లు యూఏఈ కాలమానం ప్రకారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. కానీ, పగటిపూట ఎక్కువగా వేడిగా ఉండటం వల్ల మ్యాచ్‌ను అరగంట ఆలస్యంగా, అంటే సాయంత్రం 6:30 గంటలకు ప్రారంభించాలని నిర్ణయించారు.ఆసియా కప్ 2025 ఈసారి టీ20 ఫార్మాట్‌లో జరుగుతుంది. ఈ మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం రాత్రి 7:30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. అయితే, ఇప్పుడు షెడ్యూల్‌లో మార్పు కారణంగా, భారత్‌లో ఈ మ్యాచ్‌లను రాత్రి 8 గంటల నుంచి ప్రత్యక్షంగా చూడవచ్చు. యూఏఈలో సెప్టెంబర్ నెలలో దాదాపు 40 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుంది. ఈ వేడి నుంచి ఆటగాళ్లకు కాస్త ఉపశమనం లభించడానికి మ్యాచ్ సమయాన్ని అరగంట పెంచారు. క్రికెట్ బోర్డు ఈ సమయాన్ని మార్చాలని బ్రాడ్‌కాస్టర్స్‌ను కోరింది. ఆ తర్వాత భరించలేని వేడిని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు.ఆసియా కప్‌లో ఫైనల్‌తో కలిపి మొత్తం 19 మ్యాచ్‌లు జరుగుతాయి. వీటిలో 18 మ్యాచ్‌ల సమయాలను అరగంట పెంచారు. ఈ 18 మ్యాచ్‌లు డే-నైట్ మ్యాచ్‌లు. అయితే, సెప్టెంబర్ 15న యూఏఈ, ఒమన్ మధ్య జరిగే పగటి మ్యాచ్ సమయాలలో ఎలాంటి మార్పు లేదు. ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం సాయంత్రం 5:30 గంటలకు ప్రారంభమవుతుంది.

## ఆసియా కప్ టీంలో అంతా కుటుంబ రాయుళ్లే..

### పెళ్లి కాని ప్రసాదులు ఎంతమంది ఉన్నారంటే ?



ఆసియా కప్ కోసం భారత జట్టులో అనుభవం, యంగ్ టాలెంట్ కలగలిపి ఉన్నారు. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్‌గా ఉండగా, టీమిండియా ఇంకా అతని నాయకత్వంలో ఏ టీ20 సిరీస్‌నూ ఓడిపోలేదు. శుభ్‌మన్ గిల్, తిలక్ వర్మ వంటి ఫామ్‌లో ఉన్న బ్యాట్స్‌మెన్‌లు, ఆల్ రౌండర్లు హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ జట్టును టైటిల్ గెలవడానికి ఫేవరెట్‌గా చేస్తున్నారు. ఆసియా కప్ కోసం భారత జట్టులో పెద్ద పెద్ద దిగ్గజాలను చేర్చారు. ఈ జట్టులో సీనియర్లు, జూనియర్లు ఉన్నారు. సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలో టీమిండియా ఇప్పటివరకు ఒక్క టీ20 సిరీస్‌ను కూడా ఓడిపోలేదు. శుభమన్ గిల్, తిలక్ వర్మ వంటి ఫామ్ ఉన్న బ్యాట్స్‌మెన్‌లు, అలాగే ఆల్‌రౌండ్ విభాగంలో హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ ఉండడం వల్ల భారత్ టైటిల్ గెలవడానికి బలమైన పోటీదారుగా నిలుస్తుంది. అయితే, ఆసియా కప్‌లో భారత్ తన తొలి మ్యాచ్ ఆడే ముందు, ఈ జట్టులో ఎంత మంది ఆటగాళ్లు పెళ్లయినవారు, ఎంత మంది సింగిల్స్ ఉన్నారో ఇక్కడ తెలుసుకోండి.ఆసియా కప్ భారత జట్టులో మొత్తం 10 మంది ఆటగాళ్లు పెళ్లైనవారు లేదా నిశ్చితార్థం చేసుకున్నవారు ఉన్నారు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 2016లో దేవిషా శెట్టిని వివాహం చేసుకున్నాడు. అలాగే శివం దూబే, అక్షర్ పటేల్, జితేష్ శర్మ, జస్ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, సంజు శాంసన్‌కు కూడా పెళ్లైంది. జట్టులో ఇద్దరు ఆటగాళ్లకు నిశ్చితార్థం అయింది.. కానీ ఇంకా పెళ్లి కాలేదు. కుల్దీప్ యాదవ్, రింకూ సింగ్ ఈ ఏడాది నిశ్చితార్థం చేసుకున్నారు. ఇక ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు విడాకులయ్యాయి. అతను సెర్బియన్ మోడల్ నతాషా స్టాంకోవిక్‌ను వివాహం చేసుకున్నప్పటికీ 2024లో విడాకులు తీసుకున్నారు.భారత జట్టులో ఐదుగురు ఆటగాళ్లు ఇంకా పెళ్లి కాని ప్రసాదులు ఉన్నారు. ఈ జాబితాలో మొదటి పేరు వైస్ కెప్టెన్ శుభమన్ గిల్. అతనితో పాటు, ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ అభిషేక్ శర్మ, తిలక్ వర్మ కూడా ఇంకా పెళ్లి చేసుకోలేదు. ఫాస్ట్ బౌలర్లు అర్షదీప్ సింగ్, హర్షిత్ రాణా కూడా బ్యాచిలర్లే.సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శుభమన్ గిల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివం దూబే, అక్షర్ పటేల్, జితేష్ శర్మ (వికెట్ కీపర్), జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, సంజు శాంసన్ (వికెట్ కీపర్), హర్షిత్ రాణా, రింకూ సింగ్.



## హెడ్ కోచ్ పదవికి రాహుల్ ద్రవిడ్ రాజీనామా! ఆ టీమ్‌కు ఊహించని షాక్..

రాజస్థాన్ రాయల్స్ జట్టు ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ తన పదవికి రాజీనామా చేశారు. ఐపీఎల్ 2025 సీజన్ ముందు రెండేళ్ల ఒప్పందంపై నియమితులైన ద్రవిడ్, తదుపరి సీజన్‌లో కోచ్‌గా కొనసాగకూడదని నిర్ణయించుకున్నారు. రాయల్స్ ఫ్రాంచైజీ ఆయన సేవలకు కృతజ్ఞతలు తెలిపింది.రాజస్థాన్ రాయల్స్ జట్టు ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ రాజీనామా చేశారు. ఈ విషయాన్ని ఆర్ఆర్ మేనేజ్‌మెంట్ ధృవీకరించింది. ఐపీఎల్ 2025 సీజన్ కంటే ముందు రెండేళ్ల కాల పరిమితితో హెడ్ కోచ్ బాధ్యతలు చేపట్టిన ద్రవిడ్ అకస్మాత్తుగా ఆ పదవి నుంచి తప్పుకున్నారు. ఫ్రాంచైజీ నుండి వచ్చిన ఒక ప్రకటన ప్రకారం.. సెప్టెంబర్ 6, 2024న రెండేళ్ల ఒప్పందంపై నియమించబడిన 52 ఏళ్ల లెజెండ్ ఇటీవలె జరిగిన చర్చలో వచ్చే సీజన్‌లో హెడ్ కోచ్‌గా కొనసాగేందుకు నిరాకరించినట్లు తెలుస్తోంది."రాయల్స్ జట్టు ప్రయాణంలో రాహుల్ చాలా సంవత్సరాలుగా కీలక పాత్ర పోషించారు. ఆయన నాయకత్వం ఒక తరం ఆటగాళ్లను ప్రభావితం చేసింది, జట్టులో బలమైన విలువలను నిర్మించింది. ఫ్రాంచైజీ సంస్కృతిపై చెరగని ముద్ర వేసింది" అని ఆర్ఆర్ ఫ్రాంచేజ్ పేర్కొంది. "ఫ్రాంచైజ్ నిర్మాణ సమీక్షలో భాగంగా రాహుల్‌కు ఫ్రాంచైజీలో విస్తృత స్థానం ఆఫర్ చేయబడింది, కానీ దానిని ద్రవిడ్ సున్నితంగా తిరస్కరించారు. రాజస్థాన్ రాయల్స్ దాని ఆటగాళ్ళు, ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది అభిమానులు రాహుల్ ఫ్రాంచైజీకి చేసిన అద్భుతమైన సేవకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు." అని పేర్కొంది.కాగా రాహుల్ ద్రవిడ్ గతంలో 2011, 2015 మధ్య ఆటగాడిగా, కోచ్‌గా రాయల్స్‌కు మూలస్తంభంగా ఉన్నాడు, గత ఏడాది టీమిండియా %u%20 ప్రపంచ కప్ గెలిచిన తర్వాత ద్రవిడ్ ఆర్ఆర్ హెడ్ కోచ్‌గా వచ్చారు. అయితే ఐపీఎల్ 2025 రాయల్స్ జట్టు తీవ్రంగా నిరాశపరిచింది. 14 మ్యాచ్‌ల్లో కేవలం నాలుగు విజయాలతో తొమ్మిదవ స్థానంలో నిలిచింది.

## అమ్మో.. 10 లక్షలు కాదట, 25 లక్షలట.. ఆర్సీబీ బాధితులకు భారీ పరిహారం!



బెంగళూరు తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పెద్ద సహాయం ప్రకటించింది. విక్టరీ పరేడ్ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో మరణించిన 11 మంది కుటుంబాలకు భారీగా పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. గతంలో ఈ పరిహారం రూ.10 లక్షలు ఉండగా, ఇప్పుడు దానిని పెంచారు.బెంగుళూరులో జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు (ఆర్సీబీ) భారీ ఆర్థిక సహాయం ప్రకటించింది. విజయోత్సవ ర్యాలీలో తొక్కిసలాట కారణంగా మరణించిన 11 మంది కుటుంబాలకు భారీ నష్టపరిహారం ఇస్తామని ఆర్సీబీ తెలిపింది. ఇంతకు ముందు రూ. 10 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించగా, ఇప్పుడు ఆ మొత్తాన్ని పెంచారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025లో ఆర్సీబీ మొదటిసారిగా టైటిల్ గెలుచుకుంది. ఈ విజయాన్ని పురస్కరించుకుని జూన్ 4న విక్టరీ పరేడ్‌ను నిర్వహించారు. ఈ సమయంలో జరిగిన తొక్కిసలాటలో 11 మంది చనిపోగా, 50 మంది గాయపడ్డారు.ఆర్సీబీ ఫ్రాంచైజీ తమ అధికారిక సోషల్ మీడియా ఖాతాలో ఈ విషయం ప్రకటించింది. తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన 11 మంది కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపింది. ఆర్సీబీ పోస్ట్‌లో.. "జూన్ 4, 2025న మా హృదయం ముక్కలైంది. మేము మా ఆర్సీబీ కుటుంబంలోని 11 మంది సభ్యులను కోల్పోయాం. వారు మాలో ఒకరు. వారి నగరానికి, మా సమాజానికి, మా జట్టుకు ప్రత్యేకమైన వారిలో వారు భాగం. వారి లేని లోటు ఎప్పటికీ మా జ్ఞాపకాల్లో ఉంటుంది. ఏ సహాయం కూడా ఆ లోటును పూడ్చలేదు, కానీ ఒక మొదటి అడుగుగా ఆర్సీబీ వారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున అందిస్తోంది. ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు, ఇది నిరంతర సంరక్షణకు మా వాగ్దానం కూడా." అంటూ రాసుకొచ్చింది.17 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఆర్సీబీ జూన్ 3న అహ్మదాబాద్‌లో ఐపీఎల్ ట్రోఫీని గెలుచుకుంది. ఈ సందర్భంగా జూన్ 4న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో విక్టరీ పరేడ్‌ను ఏర్పాటు చేశారు. ఈ పరేడ్ సందర్భంగా స్టేడియం వెలుపల అభిమానుల రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. దీంతో తొక్కిసలాట జరిగి 11 మంది మరణించగా, సుమారు 50 మంది గాయపడ్డారు. కర్ణాటక ప్రభుత్వం ఈ ఘటనకు ఆర్సీబీ, ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీని బాధ్యులుగా పేర్కొంది. ఈ కేసుపై ఇప్పటికీ దర్యాప్తు కొనసాగుతోంది.

# కొత్తగా ఉద్యోగం వచ్చిందా? ఆ విషయంలో కచ్చితమైన ప్లానింగ్ ఉండాల్సిందే..!




ప్రస్తుతం డిగ్రీ లేదా ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్‌లో చేరే వారికి ఉద్యోగం అనేది ఓ ఎమోషన్. తమ సొంత కాళ్లపై తాము నిలబడతామనే నమ్మకం కోసం చాలా మంది యువత కొత్త ఉద్యోగాల కోసం చూస్తూ ఉంటారు. అయితే ఉద్యోగం వస్తేనే సరిపోదని ఉద్యోగం వచ్చిన తర్వాత నుంచి ఫైనాన్షియల్ ప్లానింగ్ చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త ఉద్యోగం వచ్చిన వాళ్లు తీసుకోవాల్సిన ఫైనాన్షియల్ ప్లానింగ్ గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం. మొదటి ఉద్యోగం చేసిన వారు కచ్చితంగా ఆర్థిక పరిస్థితులను తిరిగి గాడిలో పెట్టాలని లక్ష్యంగా ఉంచుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఇలా చేయడానికి ఆర్థిక ప్రణాళిక చాలా ముఖ్యమని వివరిస్తున్నారు. మంచి ఆర్థిక ప్రణాళిక మీ ఖర్చులపై స్పష్టత, నియంత్రణను తీసుకురావడమే కాకుండా దీర్ఘకాలిక ఆర్థిక శ్రేయస్సుకు బలమైన పునాది వేస్తుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్థిక ప్రణాళిక విషయంలో తెలుసుకోవాల్సిన ముఖ్య సమాచారాన్ని చూద్దాం. మీ ఆర్థిక స్థితి గురించి స్పష్టమైన అవగాహన పొందడం చాలా ముఖ్యం. మీ ఆస్తుల నుంచి మీ అప్పులను తీసివేయడం ద్వారా మీ నికర విలువను లెక్కించాలి. ఖర్చు విధానాలు, పొదుపు ప్రాంతాలను గుర్తించడానికి మీ నెలవారీ ఆదాయం, ఖర్చులను ట్రాక్ చేయాలి. అలాగే మీ ప్రస్తుత పొదుపులు, పెట్టుబడి హోల్డింగ్‌లు, బాకీ ఉన్న అప్పులు, ఇప్పటికే ఉన్న బీమా కవరేజీని కూడా పరిశీలించాలి. ఈ స్వీయ అంచనా మీకు సమాచారంతో కూడిన ప్రణాళికతో ముందుకు సాగడానికి అవసరమైన స్పష్టతను ఇస్తుంది. స్మార్ట్ ఫ్రేమ్‌వర్క్‌ని ఉపయోగించి స్వల్పకాలిక (1%-%3 సంవత్సరాలు), దీర్ఘకాలిక (5o సంవత్సరాలు) లక్ష్యాలను ఏర్పరచుకోవాలి. ఇంటి కోసం పొదుపు చేయడం, పదవీ విరమణ కోసం పెట్టుబడి పెట్టడం లేదా మీ పిల్లల విద్యకు నిధులు సమకూర్చడం వంటివి ఉండవచ్చు. స్పష్టమైన లక్ష్యాలు మీ ప్రణాళిక ఉద్దేశ్యం మరియు దిశను అందిస్తాయి. 50/30/20 నియమాన్ని ఉపయోగించి మీ బడ్జెట్‌ను రూపొందించుకోవాలి. మీ ఆదాయంలో 50 శాతం నిత్యావసరాలకు, 30 శాతం విచక్షణా ఖర్చులకు, 20 శాతం పొదుపు మరియు రుణ చెల్లింపులకు కేటాయించండి. మీ ఖర్చు అలవాట్లను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలి. మీరు మీ ఆదాయానికి తగ్గట్టుగా జీవిస్తున్నారని, మీ లక్ష్యాల వైపు స్థిరంగా పనిచేస్తున్నారని నిర్ధారించుకోవడానికి అవసరమైన చోట సర్దుబాటు చేయాలి. మూడు నుంచి ఆరు నెలల జీవన వ్యయాలను ప్రత్యేక, సులభంగా యాక్సెస్ చేయగల ఖాతాలో పక్కన పెట్టాలి. ఈ నిధి వైద్య అత్యవసర పరిస్థితులు, ఉద్యోగ నష్టం లేదా అత్యవసర మరమ్మతులు వంటి ఊహించని సంఘటనలకు ఆర్థిక పరిపుష్టిగా పనిచేస్తుంది. సంక్షోభంలో అప్పులను నివారించడానికి మీకు సహాయపడుతుంది. ముఖ్యంగా క్రెడిట్ కార్డ్ బ్యాలెన్స్‌ల వంటి అధిక వడ్డీ రేట్లు ఉన్న అప్పులను చెల్లించడం అత్యంత ప్రాధాన్యతగా ఉండాలి. విలువ తగ్గుతున్న ఆస్తులపై కొత్త అప్పులను నివారించడం గురించి జాగ్రత్త వహిం ఆర్థిక రక్షణకు బీమా చాలా అవసరం. మీ కుటుంబ భవిష్యత్తును కాపాడుకోవడానికి మీకు టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ ఉండడం చాలా ముఖ్యం. ఆరోగ్యం, ప్రమాద బీమా కూడా అంతే ముఖ్యమైనవి. అవి మీ పొదుపును కోల్పోకుండా వైద్య ఖర్చులను భరించడంలో సహాయపడతాయి. మీ జీవనశైలి అవసరాల ఆధారంగా మీరు వాహన, గృహ లేదా ప్రయాణ బీమా వంటి ఇతర కవరేజీని కూడా పరిగణించవచ్చు.

# బిజినెస్




## పెట్టుబడిదారులకు శుభవార్త.. ఆ పథకంలో పెట్టుబడితో తక్కువ సమయంలో అధిక రాబడి



భారతదేశంలోని పెట్టుబడిదారులు తక్కువ సమయంలో అధిక రాబడి వచ్చే పథకాలపై ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా పెట్టుబడి రిస్క్ అయినా పర్లేదు కానీ మంచి రాబడి కోరుకునే వారి సంఖ్య పెరిగింది. ఇలాంటి వారికి లిక్విడ్ మ్యూచువల్ ఫండ్స్ మెరుగైన ఎంపిక అని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో లిక్విడ్ మ్యూచువల్ ఫండ్స్ గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం. లిక్విడ్ మ్యూచువల్ ఫండ్ అనేది స్వల్పకాలిక రుణ సాధనాల్లో పెట్టుబడి పెట్టే రుణ నిధి. సాధారణంగా లిక్విడ్ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి ట్రెజరీ బిల్లులు (టి-బిల్లులు), వాణిజ్య పత్రాలు, డిపాజిట్ సర్టిఫికెట్లు, కొలేటరలైజ్డ్ లెండింగ్, బారోయింగ్ ఆబ్లిగేషన్స్ (సీబీఎల్‌ఓ) వంటి సాధనాల్లో చేస్తారు. వీటి పరిపక్వత కాలం సాధారణంగా 91 రోజుల వరకు ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈ పథకం ద్వారా వచ్చే ముఖ్య ప్రయోజనాలను తెలుసుకుందాం. లిక్విడ్ మ్యూచువల్ ఫండ్ ప్రయోజనాలు సాధారణంగా లిక్విడ్ మ్యూచువల్ ఫండ్‌లో ఎంట్రీ, ఎగ్జిట్ రుసుములు ఉండవు.లిక్విడ్ మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు స్వల్ప కాలానికి ఉద్దేశించినవి కాబట్టి అవి వడ్డీ రేటు హెచ్చుతగ్గుల నుంచి తక్కువ రిస్క్‌ను ఎదుర్కొంటాయి.కనీస పెట్టుబడి మొత్తం పథకాలను బట్టి మారుతూ ఉంటుంది. పెట్టుబడిదారులు తమ బడ్జెట్ ప్రకారం పెట్టుబడి పెట్టడానికి సరళతను అందిస్తుంది.లిక్విడ్ మ్యూచువల్ ఫండ్ పనితీరు లిక్విడ్ మ్యూచువల్ ఫండ్ పెట్టుబడిదారునికి భద్రత, ద్రవ్యతను అందిస్తుంది. దీని ప్రకారం ఫండ్ మేనేజర్ మంచి క్రెడిట్ రేటింగ్, డిఫాల్ట్ అవకాశాలు తక్కువగా ఉన్న సాధనాల్లో పెట్టుబడి పెడతాడు. రాబడిని సృష్టించడం కంటే మూలధన రక్షణ చాలా ముఖ్యం. ఇది స్వల్పకాలిక పెట్టుబడి ఎంపిక కాబట్టి, వడ్డీ రేటు హెచ్చుతగ్గులకు ఇది తక్కువ హాని కలిగిస్తుంది. తక్కువ రిస్క్‌తో స్వల్పకాలిక పెట్టుబడి పెట్టాలనుకునే పెట్టుబడిదారులు లిక్విడ్ మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టవచ్చు.వెంటనే నగదు అవసరం లేని మిగులు నగదు ఉన్న వ్యక్తి లిక్విడ్ మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టడం ద్వారా మంచి రాబడిని పొందవచ్చు. లిక్విడ్ ఫండ్లు సాధారణంగా సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ కంటే మెరుగైన రాబడిని అందిస్తాయి.పెట్టుబడిదారులు తరచుగా అత్యవసర నిధిని నిర్మించడానికి తమ డబ్బును లిక్విడ్ ఫండ్లలో పెడతారు. అవసరమైన సమయంలో డబ్బును సులభంగా పొందవచ్చు. లిక్విడ్ ఫండ్‌లో పెట్టుబడి పెట్టడానికి, మీరు పెట్టుబడి పెట్టాలనుకుంటున్న పథకాన్ని అందించే ఫండ్ హౌస్ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. మీరు వెబ్‌సైట్‌లోకి ప్రవేశించిన తర్వాత పెట్టుబడి పెట్టడానికి అవసరమైన దశలను అనుసరించాల్సి ఉంటుంది. లిక్విడ్ మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టడానికి మీరు థర్డ్ పార్టీ పెట్టుబడి యాప్‌లను కూడా ఉపయోగించవచ్చు.


# ఆరోగ్యం- మహాభాగ్యం

## రాత్రిపూట తాగాల్సిన మ్యాజిక్ డ్రింక్.. మానసిక ఒత్తిడి, నిద్రలేమికి ఇక టాటా చెప్పండి..!

ప్రస్తుత బిజీ లైఫ్ లో ఆరోగ్య సమస్యలు సాధారణమైపోయాయి. రాత్రివేళ ప్రశాంతంగా నిద్రపోవాలంటే.. రోగనిరోధక శక్తిని పెంచుకోవాలంటే.. ఇంట్లో సులభంగా లభించే దాల్చిన చెక్క, పసుపుతో తయారయ్యే పాలను తాగడం ఆరోగ్యకరంగా ఉంటుంది. ఇది శరీరానికి ఉపశమనం ఇచ్చే సహజ మార్గం. ప్రస్తుత వేగవంతమైన జీవనశైలిలో చాలా మంది తరచూ నిద్రలేమి, చిన్నచిన్న జబ్బుల వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ తరహా ఆరోగ్య సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఇంట్లో సులభంగా దొరికే పదార్థాలు వాడటం మంచిది. రాత్రి పడుకునే ముందు దాల్చిన చెక్క, పసుపు కలిపిన పాలు తాగడం ఆరోగ్యాన్ని మెరుగుపరిచే మంచి అలవాటు. రోగనిరోధక శక్తి పసుపులో ఉండే కర్కుమిన్ అనే పదార్థం శరీరాన్ని వ్యాధుల నుంచి రక్షించే శక్తిని పెంచుతుంది. దాల్చినచెక్కలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ లక్షణాలు ఉంటాయి. ఇది శరీరాన్ని వైరల్ ఇన్ఫెక్షన్లు, జలుబు, దగ్గు వంటి సమస్యల నుండి కాపాడుతుంది. వీటిని పాలలో కలిపి తాగితే చలికాలపు వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుంది.రాత్రి నిద్ర రాక ఇబ్బంది పడేవారు ఈ పాలను తాగితే శరీరం రిలాక్స్ అవుతుంది. ఇందులోని సహజ గుణాలు మనసును ప్రశాంతంగా ఉంచి.. మానసిక ఒత్తిడిని తగ్గించి నిద్రను మెరుగుపరుస్తాయి. ఇది రసాయన నిద్ర మందులకు మంచి ప్రత్యామ్నాయం.పసుపు పాలు శరీరంలోని వాపులను, ముఖ్యంగా మోకాళ్ళ నొప్పులు, కండరాల నొప్పులను తగ్గించడంలో ఉపశమనం ఇస్తాయి. దాల్చినచెక్క రక్తప్రసరణను మెరుగుపరిచి ఇతర నొప్పుల నుండి ఉపశమనం కలిగించగలదు. ఇది వృద్ధులు వాడితే ఎంతో ఉపయోగకరం.ఈ పాలను తాగడం వల్ల అజీర్ణం, గ్యాస్, ఎసిడిటీ వంటి సమస్యలు తగ్గిపోతాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మెటబాలిజంను వేగవంతం చేసి బరువు తగ్గే ప్రక్రియకు సహాయపడుతుంది.ఒక గ్లాసు పాలు తీసుకుని బాగా వేడి చేయండి. అందులో అర టీస్పూన్ పసుపు పొడి, ఒక చిటికెడు దాల్చినచెక్క పొడి వేసి బాగా కలపండి. కావాలనుకుంటే రుచి కోసం ఒక స్పూన్ తేనె కలుపుకోవచ్చు. బాగా కలిపి కాస్త వేడిగా ఉండగానే తాగండి.ఇది సాధారణ ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగపడుతుంది. అయితే ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా డాక్టర్ సలహా తీసుకోవడం మంచిది. కొన్ని సందర్భాల్లో దాల్చినచెక్క లేదా పసుపు పాలు శరీరానికి అనుకూలంగా ఉండకపోవచ్చు. ముఖ్యంగా గర్భిణీలు, రోగనిరోధక మందులు వాడేవారు ముందుగా వైద్యులను సంప్రదించాలి.



## ఈ మొక్కలు మీ ఇంట్లో ఉంటే.. చక్కటి ఆరోగ్యం, మెరిసే అందం మీ వెంటే..!



శతాబ్దాల కాలం నుంచి మన ఆయుర్వేదంలో ఎన్నో రకాల మొక్కలను పలు రకాల చికిత్సలకు మెడిసిన్‌గా వాడుతున్నారు. ఇవన్నీ మన శరీర ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయి. అటువంటి వాటిలో కొన్నింటిని మనం ఇంట్లో కూడా పెంచుకోవచ్చు. అలాంటి ఆయుర్వేద ఔషధ మొక్కలు వాటితో కలిగే ఆరోగ్య ప్రయోజనాలేంటో కొన్నింటి గురించి ఇక్కడ తెలుసుకుందాం. .ప్రకృతిలో లభించే అనేక రకాల మొక్కలు, చెట్లు ఆయుర్వేద ఔషధాలుగా పనిచేస్తాయి. శతాబ్దాల కాలం నుంచి మన ఆయుర్వేదంలో ఎన్నో రకాల మొక్కలను పలు రకాల చికిత్సలకు మెడిసిన్‌గా వాడుతున్నారు. ఇవన్నీ మన శరీర ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయి. అటువంటి వాటిలో కొన్నింటిని మనం ఇంట్లో కూడా పెంచుకోవచ్చు. అలాంటి ఆయుర్వేద ఔషధ మొక్కలు వాటితో కలిగే ఆరోగ్య ప్రయోజనాలేంటో కొన్నింటి గురించి ఇక్కడ తెలుసుకుందాం..పుదీనా: పుదీనా ఆకులు.. వీటి వాసన చూస్తేనే మూడ్ అంతా రిఫ్రెష్ అయిన ఫీలింగ్ కలుగుతుంది. వంటల్లోనూ మంచి రుచి, వాసన అందించడానికి పుదీనాను వాడుతుంటారు. పుదీనా వంటల టేస్ట్ పెంచడానికే కాదు.. మన ఆరోగ్యానికీ ఎంతో మేలు చేస్తుంది. రోజూ కొన్ని పుదీనా ఆకులు మన ఆహారంలో భాగంగా తీసుకుంటే.. అనేక ఆరోగ్య ప్రయోజనాలు సొంతం చేసుకోవచ్చని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా టీ, సాస్, స్వీట్లు మొదలైన వాటికి రుచి, సువాసన కోసం దీన్ని కలుపుతారు. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, ఉబ్బరం తగ్గిస్తుంది.కరివేపాకు: పప్పు, సాంబారు వంటి అన్ని వంటకాల్లో కరివేపాకు వాడతారు. కరివేపాకు ఆకులలో క్యాల్షియం, మెగ్నీషియం, ఐరన్, ఫాస్ఫరస్, జింక్, పీచు పోషకాలతోపాటు విటమిన్-సి, విటమిన్-బి, విటమిన్-ఇలు అధికం. రోజూ దీన్ని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల బోలెడన్ని ప్రయోజనాలు పొందుతారు. మధుమేహులకు ఇది సరైన ఆహారం. నాడీసంబంధిత వ్యాధుల్నీ, క్యాన్సర్లనీ అడ్డుకుంటుందట. ఇందులో ఐరన్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.లెమన్ గ్రాస్: సువాసనతో కూడిన మొక్క లెమన్ గ్రాస్. దీన్ని టీ, సూప్, థాయ్ వంటకాల్లో వాడతారు. ఈ మొక్క ఔషధ గుణాలతో నిండి ఉంది. యాంటీ బాక్టీరియల్ మరియు యాంటీ ఫంగల్. ఇన్ఫెక్షన్, బ్యాక్టీరియా నుండి శరీరాన్ని రక్షిస్తుంది. లెమన్ గ్రాస్‌లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా లభిస్తాయి. రక్తంలో బ్యాడ్ కొలెస్ట్రాల్ లెవల్స్ ను కూడా తగ్గిస్తుంది. ఈ లెమన్ గ్రాస్‌లో అనేక పోషకాలు లభిస్తాయి. ఇవి శరీరంలోని ఇమ్యూనిటీ వ్యవస్థను పటిష్ట పరుస్తుంది. వ్యాధులు, రోగాలతో పోరాడే శక్తిని ఇస్తాయి.గిలోయ్: రోగనిరోధక శక్తిని పెంచే గుణాలకు ప్రసిద్ధి చెందినది గిలోయ్. ఇది శరీర ఉష్ణోగ్రతను తగ్గించి, రోగనిరోధక శక్తిని పెంచుతుంది. తిప్పతీగ లో యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. వీటిని మెడిసిన్స్ తయారీలో కూడా ఉపయోగిస్తారు. తిప్పతీగ ఆకులను రోజుకు రెండు తినడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తిని బాగా పెంచి ఎక్కువ వ్యాధుల బారిన పడకుండా కాపాడుతుంది. డయాబెటిక్ సమస్యలు ఉన్నవారు తిప్పతీగ చూర్ణం ప్రతి రోజు ఉదయం, సాయంత్రం తీసుకుంటే షుగర్ లెవెల్స్ ను కంట్రోల్ లో ఉంచుకోవచ్చు. తులసి: హిందూ మతంలో తులసికి ప్రత్యేక ప్రముఖ్యత ఉంటుంది. వారిలో దాదాపు ప్రతి ఒక్కరి ఇంటి ముంగిట తులసి చెట్టు కనిపిస్తుంది. ఎందుకంటే తులసి చెట్టును లక్ష్మీదేవి స్వరూపంగా భావిస్తారు. అందుకే ప్రతిరోజూ తులసి చెట్టుకు నీరు పోసి ఉదయం, సాయంత్రం దీపాలు వెలిగిస్తారు. ఇలా చేయడం వల్ల లక్ష్మీదేవి అనుగ్రహం లభిస్తుందని చాలా మంది నమ్ముతారు. అయితే, తులసి మొక్క కేవలం మతపరమైన ప్రాముఖ్యతలకు మాత్రమే కాదు..పుష్కలమైన ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుందని ఆయుర్వేదం చెబుతుంది. తులసికి అనేక ఔషధ గుణాలున్నాయి. ఇది మీ శరీర రోగనిరోధక శక్తిని పెంచుతుంది, దగ్గును తగ్గిస్తుంది, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.


# నయన్ చేజారిన బిగ్ ఆఫర్, 10 ఏళ్లకు రిపీట్..!

లేడీ సూపర్ స్టార్ నయనతార ప్రస్తుతం కోలీవుడ్‌లో అత్యధిక పారితోషికం తీసుకుంటున్న హీరోయిన్‌గా నిలిచింది. లేడీ సూపర్ స్టార్ నయనతార ప్రస్తుతం కోలీవుడ్‌లో అత్యధిక పారితోషికం తీసుకుంటున్న హీరోయిన్‌గా నిలిచింది. లేడీ ఓరియంటెడ్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఈమె నిలిచింది. తక్కువ సమయంలోనే ఎక్కువ సినిమాలు చేస్తూ బాక్సాఫీస్ వద్ద వందల కోట్ల వసూళ్లు సాధిస్తున్న ఈమె అప్పుడప్పుడు హీరోలకు జోడీగా కూడా సినిమాలు చేస్తున్న విషయం తెల్సిందే. హీరోయిన్‌గా సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న నయనతార ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవికి జోడీగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే. 2026 సంక్రాంతికి విడుదల కాబోతున్న ఆ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. నయనతార కెరీర్‌లో చాలా ఆఫర్లను కోల్పోవాల్సి వచ్చిందట. సన్నీలియోన్ మెరుపులు ఉరుములు 2013లో షారుఖ్ ఖాన్‌తో కలిసి 'చెన్నై ఎక్స్‌ప్రెస్' సినిమాలో నటించే అవకాశం వచ్చింది. కానీ ఆ సమయంలో వ్యక్తిగత విషయాల కారణంగా నయనతార తీవ్రమైన ఒత్తిడిలో ఉంది. ఒకానొక సమయంలో నయనతార సినిమాలు మానేయాలని అనుకుంది. ఆ సమయంలో షారుఖ్ ఖాన్ మూవీ అయినప్పటికీ చెన్నై ఎక్స్‌ప్రెస్ సినిమాకు నో చెప్పింది. నయనతార నో చెప్పడంతో దీపికా పదుకునే ఆ సినిమాలో నటించింది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ.400 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. చాలా కాలం పాటు నయనతార చాలా దురదృష్టవంతురాలు, ఆ సినిమాను వదులుకోవడం అనేది ఆమె కెరీర్‌లో బిగ్ మిస్టేక్ అంటూ చాలా మంది చాలా రకాలుగా విమర్శలు చేశారు. %యాశ్రీంశీ =ఘుఎ% – తారక్– హృతిక్ మధ్య అసలైన వార్ నేటి నుంచే! కట్ చేస్తే సరిగ్గా పదేళ్లకు అంటే 2023లో అదే షారుఖ్ ఖాన్‌తో జవాన్ సినిమాను చేసింది. జవాన్ సినిమా ఏకంగా రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. నయనతార ఆ సమయంలో చెన్నై ఎక్స్‌ప్రెస్ మూవీని వదిలేయడం వల్లే పదేళ్లకు రిపీట్ అయ్యి జవాన్ ఆఫర్ దక్కింది. అట్లీ దర్శకత్వంలో రూపొందిన జవాన్ సినిమాతో నయనతార బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చింది. చెన్నై ఎక్స్‌ప్రెస్ సినిమాతో బాలీవుడ్‌లో నయనతార ఎంట్రీ ఇచ్చినా పెద్దగా ప్రయోజనం ఉండక పోయేది. అదే సమయంలో నయనతారకు కోలీవుడ్‌లో ఆఫర్లు తగ్గేవి. ఆ సమయంలో నయనతార ఆ ఆఫర్‌ను ఏ పరిస్థితుల వల్ల వదులుకున్నా మంచే జరిగిందని ఇప్పుడు విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నయనతార ఇంకా కొన్ని సినిమాలను ప్రమోషన్స్‌కు హాజరు అయ్యేందుకు తిరస్కరించడం వల్ల చేజార్చుకుంది. ఆ సినిమాల్లో కొన్ని సూపర్ హిట్ కాగా కొన్ని నిరాశను మిగిల్చాయి. ఇక లేడీ ఓరియంటెడ్ కథలు కూడా కొన్ని నయనతార వద్దకు మొదట వెళ్లాయి. ఏవో కారణాల వల్ల నయనతార వాటిని సున్నితంగా తిరస్కరిస్తూ వచ్చింది. వాటిల్లోనూ కొన్ని సూపర్ హిట్ అయ్యాయి. నటీ నటులు తమకు వచ్చిన అన్ని ఆఫర్లను చేయడం సాధ్యం కాదు. కానీ వారికి లక్ ఉంటే ఒక సమయంలో మిస్ అయిన ఛాన్స్ కచ్చితంగా మరో సమయంలో దక్కుతుంది. అలా ఇండస్ట్రీలో చాలా మందికి లక్ కలిసి వచ్చి మిస్ అయిన ఆఫర్లు వచ్చాయి. అయితే నయనతారకు మాత్రం పదేళ్లకు ముందు మిస్ అయిన షారుఖ్ మూవీ ఆఫర్ పదేళ్ల తర్వాత దక్కింది. అది కూడా బ్లాక్ బస్టర్ హిట్ కావడం ఆమె లక్‌ను చూపిస్తుంది. పెళ్లి తర్వాత కూడా నయన్ చాలా బిజీగా సినిమాలు చేస్తుంది. ముందు ముందు ఆమె నుంచి మరిన్ని తెలుగు, తమిళ సినిమాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.



# సన్నీలియోన్ మెరుపులు ఉరుములు

శృంగార తార సన్నీలియోన్ కొంత కాలంగా నటనా కెరీర్ పరంగా స్తబ్ధుగా ఉన్న సంగతి తెలిసిందే. సరోగసీలో మామ్ అయిన సన్నీలియోన్, తన కిడ్స్ పెంపకం బాధ్యతను నిర్వహిస్తూనే, పలువురు పిల్లలను దత్తత తీసుకుని వారి ఆలనా పాలనా చూస్తోంది. సన్నీ – ది బెస్ట్ మామ్! అన్న మంచి పేరు తెచ్చుకుంటోంది. యుక్తవయసులో తన జీవనశైలికి భిన్నమైన లైఫ్ స్టైల్ తన పిల్లలకు ఇవ్వాలని తపిస్తోంది ఈ బాధ్యతాయుతమైన మమ్.మరోవైపు సన్నీలియోన్ తన సోషల్ మీడియాల్లో నిరంతర ఫోటోషూ ట్లతోను అభిమానులకు టచ్ లో ఉంది. తాజాగా సన్నీ షేర్ చేసిన ఓ ఫోటోషూట్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. ఇది వెండి తళుకుల గౌన్. సిల్వర్ లైనింగ్ ట్రెంచ్ కోట్ తో ఒక మైమరపు. మెరుపులు మిరుమిట్ల బ్లౌజ్ దానికి సరిపోయే స్కర్ట్ ధరించిన సన్నీలియోన్ ఎంతో అందంగా కనిపిస్తోంది. తన అందాలను ఎలివేట్ చేస్తున్న ఈ బ్లౌజ్ కి తగ్గట్టే, కాంబినేషన్ లాంగ్ సిల్వర్ కోట్ ని ఎంపిక చేసుకుని మతులు చెడగొడుతోంది. ప్రస్తుతం సన్నీ స్పెషల్ లుక్ కి సంబంధించిన ఫోటోలు ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతున్నాయి. సన్నీ కిల్లింగ్ ఎగైన్ అంటూ అభిమానులు ఈ ఫోటోలను వైరల్ గా షేర్ చేస్తున్నారు.కెరీర్ మ్యాటర్ కి వస్తే, సన్నీలియోన్ ప్రస్తుతం ఓ సౌత్ సినిమాలో నటిస్తోంది. తమిళం – తెలుగులో తెరకెక్కుతున్న ఈ చిత్రం పోస్ట్-ప్రొడక్షన్ దశకు చేరుకుంది. టైటిల్ లాంచ్ సహా విడుదల తేదీని చిత్రబృందం ప్రకటించాల్సి ఉంది. మరోవైపు సన్నీ లియోన్ హాలీవుడ్‌లో అరంగేట్రం చేయనుందని సమా చారం. ఇంకా టైటిల్ నిర్ణయించని ఈ చిత్రంలో సన్నీ ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక సైనికురాలిగా కనిపిస్తుంది. ఇప్పటికే సెట్స్ నుంచి కొన్ని ఫోటోలు లీకయ్యాయి. సైనిక దుస్తులు ధరించి, ఆయుధం పట్టుకుని వార్ జోన్‌లో తీవ్ర పరిస్థితుల్లో సన్నీ కనిపిస్తోంది.సన్నీ చివరిసారిగా ఎంటీవీ స్ప్లిట్స్‌విల్లా %శ%5 హోస్ట్‌గాను కనిపించింది. తదుపరి నెట్‌ఫ్లిక్స్ ప్రాజెక్ట్ కోసం సిద్ధమవుతోందని, పలు దక్షిణాది చిత్రాల్లో నటించనుందని కూడా తెలుస్తోంది.



# మెగాస్టార్‌తో విక్టరీ బాక్స్ బద్దలయ్యేలా!

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా అనీల్ రావిపూడి దర్శకత్వంలో 157వ చిత్రం మన శంకర వరప్రసాద్ తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం సినిమా ఆన్ సెట్స్ లో ఉంది. ఇప్పటికే కొంత భాగం షూటింగ్ పూర్తయింది. ప్రారంభోత్సవం నుంచి అనీల్ ఎలాంటి విరామం లేకుండా షూటింగ్ పనిలోనే బిజీగా ఉన్నాడు. అప్పుడప్పుడు ప్రధాన తారలు తప్పా మిగతా అందరూ షూట్ లో పాల్గొం టున్నారు. సంక్రాంతి టార్గెట్ రిలీజ్ ఫిక్స్ అవ్వడంతో అనీల్ షెడ్యూల్ ఎక్కడా డిస్టబెన్స్ కాకుండా ప్లాన్ చేసుకుని ముందుకెళ్తున్నాడు.



చిరుతో వెంకీ యాక్షన్:ఇదే సినిమాలో విక్టరీ వెంకటేష్ కూడా ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే ఆయన ఎంట్రీ ఎప్పుడు? ఉంటుంది అన్నది ఇంత వరకూ క్లారిటీ లేదు. దీంతో వెంకీ కేవలం గెస్ట్ రోల్ కే పరిమితమవుతారా? అన్న సందేహం కూడా తెరపైకి వస్తోంది. తాజాగా అందుతోన్న సమచారం మేరకు వెంకటేష్ కూడా సినిమాలో స్ట్రాంగ్ రోల్ పోషిస్తున్నట్లు కనిపిస్తుంది. చిరంజీవి తో వెంకటేష్ కాంబినేషన్ సన్నివేశాలు సినిమాకు హైలైట్ గా నిలుస్తాయని టీమ్ నుంచి లీకైంది. చిరుతో పాటు వెంకీ యాక్షన్ సన్నివేశాల్లో కనిపిస్తారుట.తొలిసారి ఇద్దరు సీనియర్లు:ఈ యాక్షన్ సన్నివేశం కూడా ఓ కాన్సెప్ట్ ప్రకారం డిజైన్ చేసారుట. వినోదం,యాక్షన్ అంశాల మేళవింపుతో సాగే కుటుంబ కథా చిత్రమిది. దీంతో యాక్షన్ సన్నివేశంలో ఫన్ కూడా యాడ్ అవుతుందని తెలుస్తోంది. కొత్త షెడ్యూల్ వచ్చే నెలలో హైదరాబాద్ లో ప్రారంభం కానుంది. చిరంజీవి-వెంకటేష్ ఇంత వరకూ ఏ చిత్రంలో కలిసి నటించలేదు. దీంతో ఆ కాంబినేషన్ లో సన్నివేశాలు ఎలా ఉంటాయి? అన్న దానిపై ఆసక్తి నెలకొంది. ఇద్దరు మంచి కామెడీ టైమింగ్ ఉన్న నటులు. కానీ ఆ టైమింగ్ వేర్వేరుగా ఉంటుంది.హ్యాట్రిక్ తర్వాత వెంకీ:ఈ విషయంలో వెంకీ చిరునే డామినేట్ చేస్తారు. మరి ఆ కామెడీ టింజ్ ను అనీల్ ఎలా రాబట్టుకుంటు న్నారో చూడాలి. ఇప్పటికే వెంకటేష్ తో కలిసి పని చేసిన అనుభవం అనీల్ కు ఉంది. ఎఫ్ -2-ఎఫ్ 3 సంక్రాంతికి వస్తున్నాం చిత్రాలతో వెంకీ కామెడీ టైమింగ్ ని పట్టాడు అనీల్. సినిమాకు ఆ టైమింగ్ బాగా వర్కౌట్ అయింది. మరి ఆ టైమింగ్ ని చిరుతో ఎలా మ్యాచ్ చేస్తారో చూడాలి. సంక్రాంతికి వస్తున్నాం బ్లాక్ బస్టర్ తర్వాత వెంకీ మరో కొత్త చిత్రం కమిట్ అవ్వని సంగతి తెలిసిందే.


# ఢిల్లీకి తంగంతో వెళ్లనున్న 'పెద్ది'

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న 'పెద్ది' సినిమా షూటింగ్ జెట్ స్పీడ్‌తో సాగుతోంది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న 'పెద్ది' సినిమా షూటింగ్ జెట్ స్పీడ్‌తో సాగుతోంది. వచ్చే ఏడాది సమ్మర్‌కి కదా సినిమాను విడుదల చేసేది అని తాపీగా బుచ్చిబాబు షూటింగ్ చేయడం లేదు. చాలా స్పీడ్‌గా సినిమాను పూర్తి చేసేందుకు బ్యాక్ టు బ్యాక్ షెడ్యూల్స్‌ను ప్లాన్ చేస్తున్నాడు. ఇప్పటికే కీలక సన్నివేశాల చిత్రీకరణ పూర్తి అయింది. మరో వైపు భారీ యాక్షన్ ఎపిసోడ్స్, పాటల చిత్రీకరణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అన్ని అనుకున్నట్లుగా జరిగితే అక్టోబర్ లేదా నవంబర్ వరకు సినిమా షూటింగ్ మొత్తం పూర్తి చేయాలని బుచ్చిబాబు ప్లాన్ చేస్తున్నాడట. త్వరలో మరో షెడ్యూల్‌కి బుచ్చిబాబు ప్లాన్ చేశాడని చిత్ర యూనిట్ సభ్యుల ద్వారా సమాచారం అందుతోంది. 'పెద్ది' సినిమాకు సంబంధించిన కొత్త షెడ్యూల్‌ను జులై 12 నుంచి ఢిల్లీలో ప్లాన్ చేస్తున్నారు. అందుకోసం చిత్ర యూనిట్ సభ్యులు ఇప్పటికే అక్కడికి వెళ్లి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అక్కడ దాదాపు వారం నుంచి పది రోజుల పాటు షూటింగ్ ఉండనుందట. రామ్ చరణ్, జాన్వీ కపూర్‌లపై రొమాంటిక్ సీన్స్ షూటింగ్ జరపనున్నారని తెలుస్తోంది. అతి త్వరలోనే పెద్ది సినిమా నుంచి కీలక అప్‌డేట్ రాబోతుంది. అందులో రామ్ చరణ్, జాన్వీ కపూర్‌లు ఉంటారనే వార్తలు కూడా వస్తున్నాయి. మొత్తానికి ఢిల్లీ షెడ్యూల్‌లో రామ్ చరణ్, జాన్వీ కపూర్‌ల కాంబో రొమాంటిక్ సీన్‌లు షూట్ చేసిన తర్వాత ఒక పాట చిత్రీకరణ కూడా ఉండబోతుందట. ఎన్టీఆర్‌తో కలిసి దేవర సినిమాలో నటించిన జాన్వీ కపూర్ ఆ వెంటనే రామ్ చరణ్ పెద్ది సినిమాలో ఛాన్స్ దక్కించుకుంది. దేవర సినిమాలో తంగం పాత్రలో నటించడం ద్వారా టాలీవుడ్‌కి పరిచయం అయింది. ఆ సినిమాలో నటనకు పెద్దగా స్కోప్ దక్కలేదు. కేవలం గ్లామర్ షో కి మాత్రమే జాన్వీ కపూర్ పరిమితం అయింది. కానీ పెద్ది సినిమాలో అలా ఉండదని తెలుస్తోంది. కచ్చితంగా దర్శకుడు బుచ్చిబాబు ఈ సినిమాలో జాన్వీ కపూర్ పాత్రకు సరైన వెయిట్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. తన గత చిత్రం ఉప్పెనలో హీరోయిన్ పాత్రకు ఉన్న ప్రాముఖ్యత ఏంటో తెలిసిందే. అందుకే ఈ సినిమాలోనూ హీరోయిన్ పాత్రకు ప్రాధాన్యత ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. మెగా కాంపౌండ్ నుండి అందుతున్న సమాచారం ప్రకారం పెద్ది సినిమా షూటింగ్ ఢిల్లీ షెడ్యూల్ తర్వాత మరో రెండు షెడ్యూల్స్‌లో పూర్తి చేయనున్నట్లు సమాచారం అందుతోంది. సినిమాలో రామ్ చరణ్ క్రీడాకారుడిగా కనిపించబోతున్నాడు. సాధారణంగా స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ మూవీ అంటే ఒకే గేమ్ ఉంటుంది. కానీ ఈ సినిమాలో చాలా గేమ్స్‌ను ప్రేక్షకులు చూడబోతున్నారు. భారీ పాన్ ఇండియా మూవీగా రూపొందుతున్న ఈ సినిమాలో కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ నటిస్తున్న విషయం తెల్సిందే. ఆయన క్యాన్సర్‌ను జయించి ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొన్నాడు. మరో షెడ్యూల్‌లోనూ ఆయన నటించే అవకాశాలు ఉన్నాయి. ఏఆర్ రెహమాన్ అందిస్తున్న సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచే అవకాశాలు ఉన్నాయి.



# యంగ్ హీరో కోసం విదేశీ స్టంట్ మాస్టర్లు!

యుగాల క్రితం అవరించిన ఓ ఆ ఆయుధమే మిరాయ్ కాన్సెప్ట్ గా తెరకెక్కుతోంది. యంగ్ హీరో తేజ సజ్జా కథాయాకుడిగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో భారీ పీరియాడిక్ చిత్రం 'మిరాయ్' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో అంచనాలు భారీగా ఏర్ప డ్డాయి. హనుమాన్ తర్వాత తేజ పాన్ ఇండియాలో మరో బ్లాసర్ట్ కొడతాడనే అంచనాలు రెట్టింపు అవుతు న్నాయి. చెడు కారణంగా మంచి తనానికి ముప్పు వాటిల్లినప్పుడు దారి చూపించే ఓ ఆయుధం పుడుతుంది. యుగాల క్రితం అవరించిన ఓ ఆ ఆయుధమే మిరాయ్ కాన్సెప్ట్ గా తెరకెక్కుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ రామోజీ ఫిలిం సిటీలో జరుగుతోంది. తేజ సజ్జాపై కీలకమైన యాక్షణ్ సన్నివేశాలను చిత్రీక రిస్తున్నారు. దీనిలో బాగంగా టాలీవుడ్-హాలీవుడ్ స్టంట్ మాస్టర్లు కలిసి పనిచేస్తున్నారు. నభాకాంత్, రాబిన్ సుబ్బుతో పాటు విదేశీ స్టంట్ మాస్టర్ల ఆధ్యర్యంలో ఈ భారీ యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఉరుములు ఇందులో కొన్ని సాహసోపేతమన సన్నివేశాల విషయంలోనే తేజ ఎక్కడా వెనక్కి తగ్గకుండా పాల్గొంటు న్నాడు. ఈ ఫైట్ సీన్ కోసం స్టంట్ మాస్టర్ల ఆధ్వర్యంలో కొంత ముందస్తు శిక్షణ కూడా తీసుకున్నాడుట. ట్రైనింగ్ అనంతరమే ఆ సన్నివేశాలు పూర్తి చేస్తున్నాడు. బాడీ లుక్ పరంగానూ తేజ మార్పులు తీసుకొ చ్చాడు. మునుపటి చిత్రం కంటే కాస్త బరువు పెరిగి మళ్లీ స్లిమ్ లుక్ లోకి మారాడు. తేజకు విలన్ గా మంచు మనోజ్ నటిస్తున్నాడు. సినిమాలో ఈ పాత్ర కూడా చాలా బలంగా ఉంటుందని ప్రచార చిత్రాలతో అర్దమవుతుంది. ప్రతి నాయకుడి ఆహార్యంలో మనోజ్ పర్ఫెక్ట్ గా సెట్ అయ్యాడు. హీరో ను మంచిని ఎలివేషన్ మిరాయ్ రూపంలో మనోజ్ కు దక్కుతుంది. విలన్ గా సక్సెస్ అయితే మనోజ్ కెరీర్ కొత్త టర్నింగ్ తీసుకున్నట్లే.



Prajajwala Telugu Daily : Printer, Publisher and Owned by APPIKONDA BHAVANI ,[LATE] A.BHASKAR RAO, Head Office: Vizag, T.S.Branch Office Address: plot no: 204, Road No:7 venus Rocks Heights, Devendra Nagar-Gajularamaram Quthbullapur, Hyderabad- 500055: prajajwalatelangana@gmail.com cell. no. 9700070315, RNI No. APTEL 2010/33400.